ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు జిల్లా వార్తలు
5
శనివారం 1 జూన్ 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0
కనిష్ఠం : 30.0

ఇంటింటికీ పింఛన్ పంపిణీ లేనట్లే..!

- గత నెల మాదిరిగానే పింఛన్ దారులకు బ్యాంకుల్లో తిప్పలు తప్పవా..
- జిల్లాలో 2.68 లక్షల పింఛన్‌దారులు

ఏలూరు సిటీ, మే 31 : జూన్‌లో అందరికీ ఇంటింటికీ పింఛన్‌లు పంపిణీ లేనట్లే అని తేల్చారు. కేవలం దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో లేవలేని స్థితిలో ఉన్నవారి, మంచంలేదా వీల్ చైర్‌కు పరిమితమైన కొంతమందికి మాత్రమే ఇంటింటికీ పింఛన్‌లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఏప్రిల్‌లో సచివాలయాల వద్దే పింఛన్లు పంపిణీ చేయగా అప్పట్లో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నికల కమిషన్ కేవలం వలంటీర్ల ద్వారా మాత్రమే పింఛన్‌లు పంపిణీ చేయవద్దని, ఇతరత్రా పింఛన్‌లు పంపిణీ చేసుకోవచ్చని తెలిపింది. సచివాలయ ఉద్యోగులు ఉన్నా ఆ నెలలో ఇంటింటికీ పింఛన్‌లు పంపిణీ చేయలేక పోయారు. ప్రతిపక్షాలు ఇంటింటికీ పింఛన్‌లు పంపిణీ చేయాలని ఇటు ఎన్నికల కమిషన్‌ను, ప్రభుత్వాన్ని కోరాయి. ఈ నేపథ్యంలో మేలో సచివాలయాల వద్ద కాకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా పింఛన్‌ల సొమ్మును జమ చేశారు. అయితే కొంతమంది బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ అవ్వడం, ఆ ఖాతాల్లో మినిమం బ్యాలెన్స్ లేకపోవడంతో పింఛన్ సొమ్ములలో కొంత బ్యాంకులలోనే ఉంచాల్సి రావడం, బ్యాంకులలో జమ చేసిన సొమ్ముల కోసం రోజుల తరబడి బ్యాంకులు చుట్టూ తిరగాల్సి రావడం, కొంత మందికి బ్యాంకు ఖాతాలు లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇక జూన్‌లోను ఇదే పరిస్థితి ఎదురు కాబోతోంది. ఇప్పుడు కూడా పింఛన్ సొమ్మును బ్యాంకు ఖాతాలకు జమ చేయడం, కేవలం దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారికి మాత్రమే ఇంటింటికీ సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు డీఆర్‌డీఏ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్‌కు సంబంధించి జిల్లాలో 2,68,886 మంది పింఛన్‌దారులుండగా వారిలో 2,01,377 మందికి రూ.60.41 కోట్లు డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారని, మిగిలిన 67,497 పింఛన్‌దారులలో దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో లేవలేని మంచానికే పరిమితమైన వారికి రూ.19.90 కోట్లు ఇంటి వద్దకు వెళ్లి అందజేస్తారని డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

సజావుగా పింఛన్ పంపిణీకి చర్యలు

డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు

ఎన్నికల ప్రవర్తనా నియమా వళిని పాటిస్తూ సామాజిక భద్రత పింఛనర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జూన్ నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా సాగేలా క్షేత్రస్థాయిలో పటిష్ఠ చర్యలు తీసుకోవా లని సంబంధిత అధికారులు, సిబ్బందిని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయరాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వేసవి తీవ్రత దృష్ట్యా సచివాలయ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఇంటింటికీ పింఛన్ కార్యక్రమాన్ని జూన్ 1వ తేదీ శనివారం ఉదయం 6 గంటలకే ప్రారంభించాలని కోరారు.

సాగునీరు అందేనా?


ఏలూరు వద్ద గుర్రపుడెక్కతో మూసుకుపోయిన గోదావరి కెనాల్

గతంలో పాలకులు, సాగునీటిశాఖ అధికారులు వేసవిలో సమీక్షలు జరిపి, మెయింటినెన్స్ పనుల పేరుతో పూడికతీతలు, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టేవారు. జూన్‌లో నీరు విడుదలైన తర్వాత రైతులు వరి సాగుకు నారుమళ్ళు పోసుకునేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా కాల్వలను పట్టించుకో లేదు. కనీస మరమ్మతులు కూడా చేపట్ట లేదు. ఉన్నా సాగునీటి సంఘాలను రద్దు చేయడంతో ఈ కాల్వల వైపు కన్నెత్తి చూసే నాథుడే కరువయ్యాడు. దీంతో పంట కాల్వలన్నీ తూడు, గుర్రపు డెక్కతో నిండిపోయాయి. కాల్వలకు నీరు వదిలినా ముందుకు కదలని పరిస్థితి నెలకొందని, శివారు పొలాలకు నీటి ఎద్దడి తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా పంట కాల్వలు

- పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క
- కనీస మరమ్మతులు చేపట్టని ప్రభుత్వం
- చోద్యం చూస్తున్న సాగునీటిశాఖ అధికారులు
- శివారు పొలాలకు నీటి ఎద్దడి తప్పదంటూ రైతుల ఆందోళన

• కాల్వలను కన్నెత్తి చూడలేదు..

ఏలూరు రూరల్, : పాలకులు, తాగునీటిశాఖ అధికారుల అలసత్వం కారణంగా ఏలూరు రూరల్ మండలంలోని పంట భూములకు సాగునీరు అందించే కాల్వలు అస్తవ్యస్తంగా మారాయి. ఏటా రైతులు పంట కాల్వల ద్వారా సాగునీరు అందుతుందని, ఆశలతో పంటల సాగు ప్రారంభిస్తారు. అయితే పాలకులు, అధికారులు నిర్లక్ష్యవైఖరి కారణంగా పంట భూములకు కాల్వల ద్వారా నీరు అందని పరిస్థితి. పంట కాల్వల పూడికతీత, గుర్రపుడెక్క తొలగించే నాథుడే కరువు అయ్యాడు. రైతుల పంట సాగుకు అవస్థలు పడుతున్నా సాగునీటిశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప కాల్వల వైపు కన్నెత్తి చూడడం లేదని రైతులు వాపోతున్నారు. ఏలూరు రూరల్ మండలంలో ప్రధానంగా గోదావరి, కృష్ణా కెనాల్ మీద ఆధారపడతారు. జాలిపూడి పంట కాల్వ ద్వారా సుమారు 10 వేల ఎకరాలు సాగవుతోంది. ఈ కాల్వ ద్వారా జాలిపూడి, మాదేపల్లి, కాట్లంపూడి, చాటపర్రు, కోటేశ్వరదుర్గాపురంలోని పంటలకు నీరు అందుతుంది. గోదావరి కెనాల్ ద్వారా పాలగూడెంలో సుమారు 6 వేల ఎకరాలకు నీరు అందుతుంది. ప్రస్తుతం గోదావరి కెనాల్ గుర్రపుడెక్కతో నిండిపోయింది. జాలిపూడి, పోణంగి పుంత పంట కాల్వ తూడికాడ, గుర్రపుడెక్కతో నిండిపోయింది. పూడిక పేరుకుపోవడం వల్ల దిగువ గ్రామాలకు పంటనీరు అందని పరిస్థితి నెలకొంది.


జాలిపూడి పంటకాల్వ దుస్థితి


కురేళ్ళగూడెం వద్ద ఏలూరు కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

...స్థితి ఏర్పడింది. మార్చి - ఏప్రిల్ నెలలో ఏలూరు గోదావరి కాల్వకు నీటి నిలిపివేసి పూడిక తీసి గుర్రపుడెక్క, తూడు తొలగించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ దీనికి సంబంధించిన మరమ్మతులు చేపట్టలేదు. దీనికి కారణం ఎన్నికల కోడ్‌ను చూపుతూ సమస్యను దాట వేస్తున్నారు. భీమడోలు మండలంలోని పూళ్ళ, కురేళ్ళగూడెం, భీమడోలు, పాతూరు గుండుగొలను ప్రాంతాల్లో ప్రధాన కాల్వల్లో గుర్రపు డెక్క పేరుకుపోయింది. మండల పరిధిలోని సుమారు 60 పంట కాల్వల్లో గుప్పెడు మట్టి కూడా తీయలేదు.

• ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపుతూ..

భీమడోలు : భీమడోలు మండల పరిధిలో 35 వేల ఎకరాల్లో వరిసాగు ఆక్వా పంటలకు నీరు ఇవ్వాల్సిన ప్రధాన గోదావరి కాల్వలతో పాటు పంట కాల్వల్లో ఇప్పటి వరకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరి...

నీటి ఎద్దడి తప్పదు..




ఖరీఫ్ సీజన్ మొదలు కాబోతుంటే ఇప్పటి వరకు పంట కాల్వలతో పాటు గోదావరి కాల్వలో పేరుకు పోయిన గుర్రపుడెక్కను తొలగించలేదు. దీని కారణంగా నీరు అందని పరిస్థితి ఏర్పడింది. కాల్వలకు మరమ్మతులు చేయకపోవడంతో ఖరీఫ్ సాగు ప్రారంభంలోనే రైతులతా నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

– రైతు గురజాల కృష్ణబాలాజీ, కురేళ్ళగూడెం

• దిగువకు నీరు అందడం కష్టమే..

మండవల్లి : కాల్వలకు నీరు విడుదల చేసిన దిగువ ప్రాంతాలకు వచ్చే పరిస్థితి లేదు. దీనికి వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్న విమర్శలు వ్యక్తవుతున్నాయి. మండవల్లి మండలంలో ఏ పంటకాల్వ చూసిన దుస్థితి అధ్వానంగానే ఉంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంట కాల్వలను పట్టించుకోలేదు. దీంతో తూడు, గుర్రపుడెక్క, చెత్తాచెదారం పేరుకుపోయి పంటకాల్వలు కాస్తా మురుగు కాల్వలా మారిపోయాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నీటి సంఘాల పేరుతో ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేసేందుకు ఎప్పటికప్పుడు ప్రణాళిక రూపొందించేవారు వైసీపీ ప్రభుత్వం వచ్చాకా సాగునీటి సంఘాలను రద్దు చేయడం, కాల్వల అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయింపు చేయకపోవడంతో అధికారులు కూడా కాల్వల వైపు కన్నెత్తి చూసిన పాపనా పోలేదు. ఈ పరిస్థితుల్లో సార్వా పంటకు నీరు విడుదల చేసినా దిగువ ప్రాంతాలకు వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మండవల్లి వద్ద మూడు తాళ్ళపాడు వెళ్లే పంటకాల్వ దుస్థితి

నేటి నుంచి కాల్వలకు నీటి విడుదల

నిడదవోలు, మే 31 : సుమారు 22 రోజుల తర్వాత జూన్ 1వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు గోదావరి డెల్టాలకు నీటిని విడుదల చేయనున్నారు. ఈ ఏడాది మే 10వ తేదీన గోదావరి డెల్టా పరిధిలోని తూర్పు, మధ్యమ, పశ్చిమ డెల్టాలకు సాగునీటి విడుదలను నిలిపివేశారు. ఎటువంటి ఆధునికీకరణ పనులు, మరమ్మతుల నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో నిడదవోలు మండలం విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి నిడదవోలు మండలం శెట్టిపేట వైర్ వద్ద ఉన్న గేట్ల నుంచి యథేచ్ఛగా గోదావరి జలాలు వృథాగా పోతున్నా నీటిపారుదల శాఖాధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలే లేవు. పశ్చిమ డెల్టా హెడ్ స్లూయిజ్ పరిధిలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 5.30 లక్షల ఎకరాలకు సాగునీరందుతుంది. అలాంటి హెడ్ స్లూయిజ్ సైతం ఈ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైంది. శివారు ప్రాంత రైతాంగానికి ఈ ఏడాది సాగునీరు సరఫరాలో సమస్యలు తప్పేటట్లు లేవు.

అమ్మో.. జూన్

ఈ నెలంతా ఖర్చులే.. గడిచేదెలా

- పిల్లల చదువులు.. సార్వాకు పెట్టుబడులు
- విద్యార్థులకు భారంగా ఫీజులు, ఇతర ఖర్చులు
- రైతులకు ఇంకా అందని ధాన్యం సొమ్ములు

జూన్ నెల వస్తుందంటేనే అన్ని వర్గాల ప్రజల్లోను అదనపు ఖర్చుల భారం వెంటాడుతోంది. ఈ మాసంలో స్కూల్స్ తెరుస్తారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు తమ పిల్లల చదువుల కోసం అప్పుల వేట ప్రారంభించాయి. వ్యవసాయ సీజన్ మొదలయ్యే మాసం కావడంతో రైతులు విత్తనాలు, భూముల దుక్కులు, ఇతర పెట్టుబడుల సొమ్ముల కోసం బ్యాంకులు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో జూన్ నెలకు స్వాగతం పలకాలంటే సామాన్య మధ్యతరగతి ప్రజలు హడలిపోతున్నారు.

పాలకొల్లు/ముదినేపల్లి, మే 31: జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. కార్మికులు, కర్షకులు, చిరుద్యోగులు, సామాన్య మధ్యతరగతి వర్గాలు ఇలా పేదా గొప్ప తేడా లేకుండా తాము ఎంత కష్టపడైనా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఫీజులతో సంబంధం లేకుండా మంచి స్కూల్‌నే ఎంపిక చేస్తున్నారు. ఇప్పుడు నర్సరీకి చిన్న తరహా కాన్వెంట్‌లో రూ.30 వేలు, కార్పొరేట్ స్కూలులో రూ.లక్ష ఖర్చవుతున్నది. తరగతులు పెరిగే కొద్దీ ఈ ఫీజులు మరింత పెరుగుతాయి. ప్రస్తుత తరగతి నుంచి పైతరగతికి వెళ్లే పిల్లల ప్రవేశానికి ఫీజులతోపాటు పుస్తకాలు, యూనిఫామ్, బెల్టులు, బూట్లు, బ్యాగులు, ఇతర స్టడీ మెటీరియల్‌కు రూ.50 నుంచి లక్ష వరకు కావాలి. సగటు వేతన జీవులైతే తమ పిల్లలకు మంచి చదువుల కోసం టెక్నో, ఐఐటీ అకాడమీ అంటూ ప్రచారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు అప్పుల పాలవుతున్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీతోపాటు ఇంజనీరింగ్, మెడిసిన్ సీట్ల కోసం లక్షల్లోనే ఫీజులు చెల్లించాల్సిందే. పిల్లల చదువుల విషయంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వస్తున్నాయి. మొత్తంగా జూన్ మాసంలో పేద కుటుంబాల తల్లిదండ్రుల పరిస్థితి దయనీయంగా మారుతుంది.



భారంగా పిల్లల ఫీజులు



■ మా అబ్బాయి, అమ్మాయి 1, 4 తరగతులు చదువుతున్నారు. వారికి మంచి చదువు చెప్పించాలనే ఉద్దేశంతో ఫీజులు భారమైనా కాన్వెంట్‌లో వేశా. నేను చేస్తున్న చిరుద్యోగం ద్వారా నెలకు రూ.12 వేలు ఆదాయం వస్తుంది. పిల్లలకు ఫీజులు కట్టడానికి కొన్ని సందర్భాల్లో నెలకు రూ.3 వడ్డీకి తెస్తున్నాను. విద్య, వైద్యం పూర్తిగా ఉచితం చేసి ప్రభుత్వమే ఆ ఖర్చులు భరిస్తే మాలాంటి పేదలు సైతం పిల్లలకు మంచి భవిష్యత్‌ను ఇవ్వగలుగుతాం.

– శిదగం సతీష్, పాలకొల్లు

ధాన్యం సొమ్ములు రాక..



■ ధాన్యం విక్రయించి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ సొమ్ములు రాలేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. జూన్‌లో సార్వా మొదలుపెట్టాలి. సాగుకు సొమ్ములు లేక ఇబ్బంది పడుతున్నా. ఏరువాక అనేది రైతులకు ముఖ్యమైనది. ఈ ఏడాది ఆదిలోనే ఇన్ని కష్టాలు పడుతున్నాం.

– కడలి ఆంజనేయులు, రైతు, పెనుమదం

ఏరువాక సాగేనా..

రైతుల పరిస్థితి కూడా ఏమంత ఆశాజనకంగా లేదు. ఏరువాక ఆరంభం నుంచి రైతు వడ్డీకి తెచ్చిన సొమ్ముతోనే సాగు మొదలవుతుంది. ప్రకృతి కరుణించి పంట చేతికి వచ్చి ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తే సొమ్ములు ఎప్పుడు వస్తాయో తెలియదు. సాగు ఆరంభం నుంచి పెట్టుబడి పెట్టిన రైతుకు పంటను మార్కెట్‌కు తరలించినా సొమ్ము చేతికి రాని పరి స్థితి. దాళ్వా మాసూళ్లు పూర్తయ్యి, ధాన్యం ఆర్బీకేలకు తరలిం చినా ఇప్పటికీ అధిక శాతం రైతులకు సొమ్ములు అందలేదు. మరోవైపు సార్వా సాగుకు సమాయత్తం కావ్వాల్సిన పరిస్థితి. నేటి రైతు పరిస్థితి 'ఆరుగాలం శ్రమ - ఆదాయం భ్రమ' అన్న రీతిన తయారైంది. దీంతో రైతులు సాగంటేనే మక్కువ చూపడం లేదు. సార్వా పండించిన పంట చేతికి వస్తుందో రాదో తెలియదు. పంట చేతికిచ్చినా సొమ్ములు ఎప్పుడు వస్తాయో అర్థం కాదు. ఈ పరిస్థితుల్లో నూతన పనలీ ఆరంభమైనా రైతులు మునుపటి ఉత్సాహాన్ని చూపించడం లేదు.

15 మంది ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి

7

విద్యుత్ కట్..కట

పెరుగుతున్న విద్యుత్ వినియోగం.. ఎండల తీవ్రతతో విద్యుత్ అంతరాయాలు

ఏలూరు సిటీ, మే 31 : విద్యుత్ కోతలతో జనం విలవిలలాడుతున్నారు. జిల్లాలో విద్యుత్ కోతలు జఠిలంగా మారాయి. ఒక పక్క తీవ్ర ఉష్ణోగ్రతలు, మరో పక్క అప్రకటిత విద్యుత్ కోతలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. విద్యుత్ సరఫరాకు సరిపడా విద్యుత్ కోటా వచ్చినా తార స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలకు ట్రాన్స్‌ఫార్మర్లు మొరాయించడం, సాంకేతిక పరంగా విద్యుత్ ఇబ్బందులు ఏర్పడుతుండడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. అప్రకటిత విద్యుత్ కోతలు తట్టుకోలేక వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. ప్రచండ భానుడి ప్రతాపంతో ఉక్కబోత విపరీతంగా పెరగడం, బయటకు వెళితే ఎండ తీవ్రత, ఇంట్లో ఉంటే విద్యుత్ కోతలతో ఇబ్బందులు తాళలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. రోహిణి కార్తెలో కోతలు విపరీతంగా పెరిగాయి. అప్రకటిత విద్యుత్ కోతలను రాత్రి సమయాల్లో విధించడం వల్ల జనం నిద్రకు దూరమవుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎండ తీవ్రత సమయంలో విద్యుత్ కోతలు విధించడం వల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా పనులు సక్రమంగా జరగడం లేదు. నాలుగు రోజులుగా ఎండల తీవ్రత విపరీతంగా పెరగడంతో జిల్లాలో విద్యుత్ వినియోగం పెరగడంతో విద్యుత్ అంతరాయాలు పెరుగుతున్నాయి. అప్రకటిత విద్యుత్ కోతల అమలులో భాగంగా విద్యుత్ సరఫరాను గంట నుంచి రెండు గంటల పాటు నిలిపివేస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు. ఒక పక్క ఎండవేడిమి భరించలేక, మరో పక్క విద్యుత్ కోతలతో ఉక్కబోత భరించలేక ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. జిల్లాలో ఎటువంటి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

వేళాపాళా లేని విద్యుత్ కోతలతో అవస్థలు

మండవల్లి : మండవల్లి పరిసర గ్రామాల్లో ఎండ తీవ్రతకు తోడు మూడు రోజులు నుంచి కరెంటు కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు ఆరోపించారు. శుక్రవారం మండవల్లిలో వారు విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజుల నుంచి కరెంటు ఎప్పుడు పోతుందో ఎప్పుడు వస్తుందో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండవల్లి, పెరికేగూడెం, కొర్లపాడు, లింగాల, కానుకొల్లు, గన్నవరం, కలవపూడి, సింగనపూడి తదితర గ్రామాల్లో గురువారం రాత్రి 8 గంటల నుంచి సుమారు 11గంటల వరకు కరెంటు కోతతో జనం ఇబ్బందులు పడ్డారన్నారు. మరోవైపు కరెంటు కోత సమయంలో దోమలు విజృంభిస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి కరెంట్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

విద్యుత్‌శాఖ తీరుపై ఆగ్రహం..

పోలవరం, మే 31 : పోలవరం మండలంలో కొన్ని రోజులుగా జరుగుతున్న విద్యుత్ కోతల పట్ల ఆయా గ్రామస్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ కోత ఉంటుందని ప్రకటించిన విద్యుత్ శాఖ అధికారులు 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు నుంచి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం గుడ్డిగూడెం సబ్ స్టేషన్ వరకు 400 కేవీ విద్యుత్ వైర్ల కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. కొన్ని రోజులుగా ఎండల తీవ్రత పెరిగి వడగాల్పులు, ఉక్కబోతతో గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నారని విద్యుత్ సరఫరా లేకపోవడంతో మరింత ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని విద్యుత్ సరఫరాకి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరారు.



• భానుడి భగభగలు

జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. ఉక్కపోతలో జనం అల్లాడిపోతున్నారు. రోహిణి కార్తెలో సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచే వడగాడ్పుల తీవ్రత కొనసాగింది. మధ్యాహ్నం రోడ్లపై జన సంచారం కన్పించడం లేదు. నైరుతి రుతుపవనాలు వచ్చే వరకు ఎండ తీవ్రత తప్పదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. పై చిత్రంలో నిత్యం రద్దీగా ఉండే ఏలూరు పాతబస్టాండ్ సర్కిల్ శుక్రవారం మధ్యాహ్నం ఇలా నిర్మానుష్యంగా కన్పించింది.

7

ఇంటివద్దే ఇంటర్ వాల్యుయేషన్

ఆన్‌లైన్ మూల్యాంకనకు ఇంటర్ జవాబు పత్రాలు.. ముగిసిన సప్లిమెంటరీ పరీక్షలు

ఏలూరు ఎడ్యుకేషన్, మే 31 : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన ఒకేషనల్ బ్రిడ్జి కోర్సు పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయని డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 254 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 151 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 205 మంది దరఖాస్తు చేసుకోగా 163 మంది హాజరు కాగా మొత్తం 148 మంది గైర్హాజరయ్యారు.

తొలిసారిగా ఆన్‌లైన్ మూల్యాంకనం

ఇంటర్ జవాబు పత్రాల రీకౌంటింగ్, రీవాల్యుయేషన్‌లను ఇప్పటికే రెండేళ్లుగా ఆన్‌లైన్ వాల్యుయేషన్ ద్వారా విజయవంతంగా నిర్వహిస్తున్న ఇంటర్‌బోర్డు తాజాగా అదే విధానాన్ని సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాలకు అమలు చేసేందుకు నిర్ణయించింది. ఈ మేరకు సబ్జెక్టుల వారీగా అధ్యాపకులను గుర్తించిన అధికారులు ఆన్‌లైన్ మూల్యాంకనకు వీలుగా శిక్షణనివ్వడంతో పాటు, ప్రతీ లెక్చరర్‌తో శాంపిల్‌గా ఐదు జవాబు పత్రాలను మూల్యాంకన చేయించే ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోంది. దీనిని విజయవంతంగా పూర్తిచేసిన వారికే ఆన్‌లైన్ వాల్యుయేషన్ విధులు చేపట్టేలా టీచర్ యూనిక్ ఐడీ, పాస్‌వర్డ్‌లను ప్రతీ లెక్చరర్ (ఏఈ/సీఈ)లకు ఇంటర్‌బోర్డు కేటాయించింది. స్పాట్ వాల్యుయేషన్ క్యాంపులతో నిమిత్తం లేకుండా జవాబుపత్రాలను సంబంధిత సబ్జెక్టు లెక్చరర్ ఇంటివద్ద లేదా కళాశాలలో కంప్యూటర్ స్క్రీన్/ ల్యాప్‌టాప్ స్క్రీన్‌పై చూస్తూ ఆయా ప్రశ్నల సమాధానాలకు మార్కులను నమోదు చేసేలా ఏర్పాటు చేశారు. సోమ లేదా మంగళవారం నుంచి ప్రారంభమయ్యే ఆన్‌లైన్ వాల్యుయేషన్ ఉదయం 7గంటల నుంచి రాత్రి 8గంటల వరకు కొనసాగనుంది. జవాబు పత్రంలోని ప్రతీ ప్రశ్నకు విద్యార్థి రాసిన సమాధానాన్ని మూల్యాంకనచేసి మార్కులు నమోదు చేసిన తర్వాతే తదుపరి ప్రశ్న/ సమాధానం కనబడేలా ఏర్పాటు చేశారని అధికార వర్గాలు వివరించాయి. అలాగే విద్యార్థి రాసిన సమాధానానికి మూల్యాంకనం సరిగా జరిగిందీ, లేనిదీ పరిశీలించడంతో పాటు, మార్కుల నమోదు పైనా గమనించేందుకు వీలుగా ప్రతీ ఐదుగురు అసిస్టెంట్ ఎగ్జామినర్ల (లెక్చరర్) పైనా సెకండ్ లెవెల్ వాల్యుయేషన్ నిమిత్తం ఒక చీఫ్ ఎగ్జామినర్ ఉంటారని వివరించారు. జిల్లాకు మొత్తం 30,800 జవాబు పత్రాలను ఆయా సబ్జెక్టు నుంచి మూల్యాంకనం నిమిత్తం కేటాయించగా, వారం నుంచి పదిరోజుల వ్యవధిలోగా ఆన్‌లైన్ వాల్యుయేషన్‌ను ముగించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపాయి.

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు : కలెక్టర్



ఏలూరు సిటీ, మే 31 : సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ఠ భద్రతా చర్యల మధ్య పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ స్పష్టం చేశారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్ లను, కౌంటిం గ్ కేంద్రాలను శుక్రవారం ఎస్పీ మేరీ ప్రశాంతితో కలిసి కలెక్టర్ పరిశీలిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల మధ్య ఈవీఎంలోని ఓట్ల పూర్తి ఫలితాలు అందించేందుకు, సుమారు 5గంటలలోపు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల పూర్తి ఫలితాలు అందించా లనే దిశగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఇప్పటికే మూడంచెల భద్రతా ఏర్పాట్లతో నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు. జేసీ లావణ్యవేణి , ఏఎస్పీ స్వరూపరాణి , ఐటీడీఏ పీవో ఎం. సూర్యతేజ, డీఆర్వో పుష్పమణి, ఆర్వోలు పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి

జిల్లాలో జూన్ 4వతేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు సంబంధిత అధికారుల సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. సర్ సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జూన్ 4 వతేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రంలో విధులు కేటాయించిన అధికారులు , సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై శుక్రవారం ఎస్పీ మేరీ ప్రశాంతితో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ హాలులోకి సెల్ ఫోన్లను, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబడవన్నారు. సిబ్బందికి సంబంధించి ర్యాండమైజేషన్ జూన్ 3న నిర్వహించి శిక్షణ అందించాలన్నారు. మీడియా పాయింట్ వరకు మాత్రమే ఎన్నికల కమిషన్ జారీ చేసిన గుర్తింపు కార్డు కలిగిన పాత్రికేయులకు సెల్‌ఫోన్ అనుమతించబడతాయన్నారు.


ఏలూరు పాత బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మానుష్యం


జీలుగుమిల్లిలో నిర్మానుష్యంగా సెంటర్


పాలకొల్లులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డు


ఉండిలో..

భానుడి భగభగలు

- పెరిగిన వడగాల్పులు.. నిర్మానుష్యంగా రోడ్లు
- ఎండ తీవ్రతతో తల్లడిల్లిన జనం

ఏలూరుసిటీ, మే 31: భానుడి భగభగలు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచే కొనసాగాయి. ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని ఏలూరు నగరంతో పాటు అన్ని పట్టణాలు, మండల కేంద్రాలలో ప్రధాన రహదారులపై జన సంచారం పూర్తిగా తగ్గింది, ఏలూరు నగరంలో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. ఏలూరు జిల్లా కేంద్రంలో 41 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ ఎండ వేడిని తట్టుకోలేకపోయామని పలువురు చెబుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే వడగాడ్పుల తీవ్రత కొనసాగింది. గాలిలో తేమ 48 శాతం వరకు నమోదు కావడంతో ఉక్కపోత విపరీతంగా పెరిగిందని చెబుతున్నారు. వడగాడ్పుల తీవ్రతకు జనం అల్లాడిపోయారు. చిన్నారులు, వృద్ధుల ఇబ్బందులు వర్ణనాతీతం. రోహిణి కార్తెలో వారంరోజులుగా ఎండ ప్రభావం కనిపిస్తూనే ఉన్నా గురువారం నుంచి ఎండ తీవ్రత మరింత పెరిగింది. రోహిణి కార్తె ప్రభావం ఇంకా కొన్ని రోజుల పాటు ఉంటుందని, నైరుతి రుతుపవనాలు వచ్చే వరకు ఎండ తీవ్రతలు తప్పేలా లేవని భావిస్తున్నారు. జూన్ మొదటి వారంలో రుతుపవనాలు వస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ చెబుతోంది. వాతావరణం చల్లబడుతుందేమోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. గ్రీష్మ తాపం ఎక్కువగా ఉండడంతో ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. కూల్‌డ్రింక్ షాపులు, కొబ్బరి బొండాల షాపులు, పండ్ల రసాల షాపులు, బటర్‌మిల్క్, సుగంధి, లస్సీ దుకాణాల వద్ద రద్దీ ఎక్కువగా కనిపిస్తోంది.

పనిచేయని ఏసీలు..

ఎండ తీవ్రత విపరీతంగా పెరుగుతుండటం, దానికి తగ్గట్టుగా విద్యుత్ కోతలు ఉండడంతో ఎండ సమయంలో ఏసీలు పనిచేయక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. లో-ఓల్టేజి సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఏసీలు పనిచేయడం లేదని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. విద్యుత్ సరఫరాలో కోతలు లేకుండా సరఫరా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

రోడ్లు నిర్మానుష్యం

ఆకివీడు/తణుకు/ పోలవరం/ ఉండి/ పాలకొల్లు అర్బన్/ ఆచంట/ అత్తిలి/ జీలుగుమిల్లి/ చింతలపూడి, మే 31 : ఆకివీడు, ఆచంట, అత్తిలి, జీలుగుమిల్లి, చింతలపూడి మండలాల్లో శుక్రవారం ఉదయం పదకొండు గంటల నుంచే జనసంచారం లేక రహదారులు నిర్మానుష్యంగా మారాయి. తణుకు రాష్ట్రపతి రోడ్డుతో పాటు ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. పోలవరం మండలంలో వడగాల్పులతో పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో కొంతమంది ఇళ్లల్లో ఉండలేక చెట్ల కింద తలదాచుకున్నారు. మరికొంతమంది సినిమా థియేటర్‌లకు చేరి సేద తీరారు. వ్యాపార వాణిజ్య సంస్థలు వెలవెలబోయాయి. నిత్యం రద్దీగా ఉండే ఉండి పెద్ద వంతెన సెంటర్ బోసిపోయింది. బస్టాండ్ నిర్మానుష్యంగా మారింది. పాలకొల్లులో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. గంట గంటకు విద్యుత్ కోతలతో ప్రజలకు అవస్థలు తప్పలేదు.

మేమేం పాపం చేశాం..!

- ఎండల్లో అంగన్‌వాడీ చిన్నారుల పాట్లు
- గర్భిణులు, బాలింతల పరిస్థితి మరింత దారుణం
- కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలంటూ డిమాండ్
- ఇంటివద్దకే పోషకాహారం అందించాలని విజ్ఞప్తి


దెందులూరులో అంగన్వాడీ కేంద్రం నుంచి ఎండలో నడిచి వెళ్తున్న చిన్నారులు

దెందులూరు, మే 31 : ఎండదెబ్బకు పెద్దలే భయపడిపోతుంటే ఉన్నతాధికారుల తీరుతో అంగన్‌వాడీ చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎండలు విపరీతంగా ఉన్నాయి. పిల్లలు, వృద్ధులు ఉదయం తొమ్మిది గంటలు దాటిన తర్వాత ఆరు బయటకు రోడ్డు మీదకు తిరగవద్దని పదే పదే డాక్టర్లు అధికారులు సూచిస్తున్నప్పటికీ పిల్లల విషయంలో మాత్రం అధికారులకు కనికరం ఉండడం లేదు. వేసవి ఎండల దెబ్బకి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చారు. కానీ అంగన్వాడీ కేంద్రాల టీచర్లు, సహాయకులు పిల్లలు చేసుకున్న పాపమేంటో తెలియదు. వారికి మాత్రం సెలవులు ఇవ్వకుండా ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఇంటికి వచ్చే క్రమంలో ఎండకు చిన్నారులు ఇబ్బందులకు గురై అనారోగ్యం బారిన పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 18 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వీటి పరిధిలో 3,889 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఆరు నెలల నుంచి ఐదేళ్ల వరకు చదివే చిన్నారులు 1,70,698 మంది ఉన్నారు. గర్భిణులు, బాలింతలు 44,123 మంది వరకు ఉన్నారు. ప్రస్తుతం కేంద్రాల నిర్వహణ తీరు పూర్తిగా మారింది. ఈ కేంద్రాల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ఏర్పాటు చేసి విద్యను నేర్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ సంవత్సరం అంగన్‌వాడీ కేంద్రాల్లో 20,185 మంది విద్యనభ్యసించి నూతన విద్యా సంవత్సరంలో బయటకు వెళ్లగా ప్రభుత్వ పాఠశాలలో 14,079 మంది చేరగా, ప్రైవేటు పాఠశాలల్లో 6,108 మంది చేరారు. దెందులూరు మండలంలో గతంలో కేంద్రాలకు సొంత భవనాలు లేక ఇబ్బంది పడే వారు. ఇప్పుడు దాదాపు 90 శాతం పైగా నూతన హంగుల నిర్మించిన భవనాలలో చక్కటి వాతావరణంలో అంగన్వాడీ చిన్నారులకు విద్యను అందిస్తున్నారు.

పౌష్టికాహారాన్ని ఇళ్లకు పంపి సెలవులు ఇవ్వొచ్చు..

మండుతున్న ఎండల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు రావడం అనేది సరైనది కాదని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కరోనా సమయంలో అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు రాకుండా బియ్యం, సరుకులు, పాలు, గుడ్లను ఇళ్లకు పది రోజులకొకసారి పంపిణీ చేసేవారు. ఆ మాదిరిగా ఎండలు తగ్గే వరకు సెలవులు ఇచ్చి పోషకాహారాన్ని అందించాలని చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు కోరుతున్నారు.

ఎండలో బతుకు వేట

- చిరువ్యాపారులకు తప్పని వెతలు

గణపవరం, మే 31 : నిప్పులు చెరుగుతున్న రోహిణి కార్తె ఎండల్లో చిరువ్యాపారులు దినసరి కూలి కోసం బతుకువేట ప్రారంభించారు. ఉదయం ఏడు గంటలు దాటితే కాలు బయటపెట్టడం చాలా కష్టంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రహదారుల వెంబడి చిరువ్యాపారాలు చేసుకునే వారి అవస్థలు వర్ణనాతీతం. మామిడి, తాటిముంజలు, నిమ్మకాయలు, బొప్పాయి, చేపలు, రొయ్యలు, తాటిబెల్లం, కొబ్బరిబొండాలు, తదితర కూరగాయలతో పాటు తోపుడుబళ్లపై కూడా పలు రకాల విక్రయించుకునే వారిని చూస్తే జాలిపడక తప్పదు. రెక్కాడితేకానీ డొక్కాడని నిరుపేదలు తమ బతుకు బండిని నడిపించేందుకు రోడ్డెక్కాల్సి వస్తుంది. మండుటెండలు లెక్కచేయకుండా గణపవరం నుంచి ఏలూరు రహదారిలో బొబ్బిలి వంతెన ఇరువైపుల నుంచి గణపవరం, తాడేపల్లిగూడెం రహదారిలో వెళ్లే రహదారుల వెంబడి చిరువ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు. ముఖ్యంగా మండుటెండల్లో మెట్ట ప్రాంతాల నుంచి డెల్టా ప్రాంతాల నుంచి ఆటోలు, వ్యాన్‌లు లేదా బస్సుల్లో వచ్చి సరుకులు తెచ్చి విక్రయిస్తున్నారు. ఇవి విక్రయిస్తేనే కానీ దినసరి కూలి గిట్టడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండైనా వానైనా అమ్మాల్సిందే..

ఎండ తీవ్రతను లెక్కచేయక తప్పదు. కూరగాయాలు విక్రయించకపోతే ఎండకు పాడైపోతాయి. పొట్ట నింపుకోవడానికి ఎండలో విక్రయాలు చేస్తున్నాం. ఎండొచ్చినా, వానొచ్చినా బతకాలంటే రోజుకు రూ.800 వరకు కూలి వచ్చేలా ఈ బళ్ళపై వ్యాపారం తప్పనిసరి.

- చేగొండి సుబ్బయ్య, కూరగాయల వ్యాపారి



పొట్టకూటి కోసం తప్పదు

తాటిముంజల సీజన్‌లో ఇక్కడకు వచ్చి అమ్ముతుంటాం ఎండ తీవ్రంగా ఉన్న వ్యాపారం చేయక తప్పదు. నీలాద్రిపురం, దూబచర్ల తదితర మెట్ట ప్రాంతాల నుంచి మోటారు సైకిళ్లపై ముంజలు తీసుకొచ్చి ఇక్కడ అమ్ముతున్నా. డజను రూ.50 చొప్పున విక్రయిస్తున్నా. కూలి గిట్టుబాటు కావడం లేదు.

- వీరన్న, తాటిముంజలు వ్యాపారి, నీలాద్రిపురం



డీసెట్‌లో నిడమర్రు మండల విద్యార్థినులకు స్టేట్ ర్యాంకులు

- మీనాక్షికి స్టేట్ ఫస్ట్ ర్యాంకు.. సునీతా హస్వినికి 13వ ర్యాంకు


మీనాక్షి, సునీతాహస్విని

నిడమర్రు, మే 31 : డీఈడీ ప్రవేశపరీక్ష డీసెట్-2024 ఫలితాలలో నిడమర్రు మండలం దేవర గోపవరం గ్రామానికి చెందిన కేశన మీనాక్షి రాష్ట్రస్థాయిలో భౌతిక శాస్త్ర విభాగంలో ప్రథమ ర్యాంకు సాధించింది. విద్యార్థిని తండ్రి సూర్యచంద్రరావు వ్యవసాయ కూలీ, తల్లి సునీత గృహిణి. స్థానికంగా గల పెదనింద్రకొలను ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ప్రస్తుతం పామర్రు ప్రగతి కాలేజీలో ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. తన ఈ ర్యాంకు రావడానికి కారణం ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్ పూర్ణచంద్రరావు గైడ్ టీచర్‌గా ప్రోత్సహించినట్టు తెలిపారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడమే ధ్యేయంగా పేర్కొంది.

నిడమర్రు విద్యార్థిని హస్వినికి 13వ ర్యాంకు

నిడమర్రు గ్రామానికి చెందిన కన్నాజి సునీతా హస్వీని డీసెట్-2024 ఫలితాలలో గణిత విభాగంలో రాష్ట్రస్థాయిలో 13వ ర్యాంకు సాధించారు. ఆమె నిడమర్రు ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసి, గణపవరం చాణక్య కళాశాలలో ఇంటర్ పూర్తిచేసింది. విద్యార్థిని తండ్రి సత్తిబాబు వ్యవసాయం కుటుంబానికి చెందిన వారు. హస్వినికి ఉత్తమ ర్యాంకు పట్ల గ్రామంలో పలువురు అభినందించారు.

ఉత్తమ పోస్టుమాస్టర్‌గా గొట్టాపు శ్రీనివాస్


ఉత్తమ పోస్టుమాస్టర్‌గా అవార్డు అందుకుంటున్న గొట్టాపు శ్రీనివాస్

ఉంగుటూరు, మే 31 : విజయవాడ రీజియన్‌లో ఉత్తమ సేవలందించిన ఉంగుటూరు పోస్టుమాస్టర్ గొట్టాపు శ్రీనివాస్ విశాఖలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నట్టు శుక్రవారం తెలిపారు. 2023-24 ఏడాదికి గాను ఉత్తమ సేవల నేపథ్యంలో ఏలూరు జిల్లా ఉంగుటూరు పోస్టుమాస్టర్ గొట్టాపు శ్రీనివాస్ అవార్డును అందుకున్నారు. ఉత్తమ పోస్టుమన్‌గా ఉంగుటూరు పోస్టాఫీసులో పనిచేస్తున్న షరీఫ్ అవార్డును అందుకున్నారు. గ్రామంలో పోస్టాఫీసు ద్వారా నోటరీ స్టాంపులు, రికరింగ్ డిపాజిట్ల ఖాతాలు పెద్దఎత్తున ప్రారంభించడంతో పాటు ఆధార్ కార్డులకు ఫోన్ నెంబర్లు లింక్ చేయడం, గ్రామీణ తపాలా లక్ష్యాలపై వీరి సేవలను గుర్తించారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో ఏపీ పోస్టల్ సర్కిల్ సీపీఎంజీ ప్రకాశ్, విజయవాడ రీజియన్ పీఎంజీడీవీఎస్ఆర్ మూర్తి తనకు పురస్కారం అందించారని పోస్టుమాస్టర్ శ్రీనివాస్ తెలిపారు.

ఓపెన్ స్కూల్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 'పాస్ గ్యారెంటీ' ఆఫర్ ?!

- డీఈవోకు పీడీఎస్‌యూ జిల్లా నాయకుల ఫిర్యాదు

ఏలూరు ఎడ్యుకేషన్, మే 31 : ఓపెన్ స్కూల్స్ పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమవుతున్నందున పకడ్బందీగా నిర్వహించాలని అభ్యర్థిస్తూ డీఈవో అబ్రహంకు శుక్రవారం పీడీఎస్‌యూ జిల్లా నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కె.నాని మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి/ఏప్రిల్ నెలల్లో జరిగిన రెగ్యులర్ పరీక్షలకు జిల్లాలోని కొన్ని అక్రిడిటేషన్ ఇనిస్టిట్యూట్(పాఠశాల/కళాశాల)ల యాజమాన్యాలు పాస్ గ్యారెంటీపేరుతో ఇంటర్ పరీక్షార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేశాయని ఆరోపించారు. కొందరు అభ్యర్థులు పాస్ గ్యారెంటీకి ఆశపడి రూ.10వేల నుంచి రూ.20 వేల వరకు ఏఐ కేంద్రాల యాజమాన్యాలకు చెల్లించారని వివరించారు. ఈవిధంగా అక్రమంగా వసూలుచేసిన డబ్బులకు రశీదులు ఇవ్వకుండా విద్యార్థుల నుంచి ఫోన్ పే, నగదు రూపంలో వసూలు చేసి మోసం చేశాయని ఆరోపించారు. రెగ్యులర్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు తాజాగా నిర్వహిస్తోన్న సప్లిమెంటరీ పరీక్షల్లో మిగిలిన సబ్జెక్టులు పాస్ కావాలంటే తాము డిమాండ్‌చేసిన డబ్బులు ఇవ్వాల్సిందేనని మళ్ళీ డిమాండ్ చేస్తున్నాయని వివరించారు. ఇటువంటి యాజమాన్యాల చేతిలోపడి సప్లిమెంటరీ పరీక్షార్థులు మరో దఫా మోసపోకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. డీఈవోను కలిసిన పీడీఎస్‌యూ నాయకుల్లో రేవంత్ తదితరులున్నారు. పీడీఎస్‌యూ నాయకుల ఆరోపణలపై జిల్లా విద్యాశాఖ వర్గాలను వివరణ కోరగా.. ' ఓపెన్ స్కూల్స్ రెగ్యులర్ పరీక్షల్లో పాస్‌గ్యారెంటీ అంటూ కొందరు విద్యార్థులు ఏఐ కేంద్రాల యాజమాన్యాలకు డబ్బులు ఇచ్చి మోసమోయినట్టు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేస్తే సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని బహిరంగ ప్రకటనలు ఇచ్చినా ఇంతవరకు ఒక్కరూ ముందుకురాలేదు. ఇపుడైనా ఫిర్యాదుచేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

అలరించిన మూడు నాటికలు

- రెండో రోజు జాతీయస్థాయి నాటిక పోటీల ప్రదర్శన

భీమవరం అర్బన్, మే 31 : చైతన్య భారతి సంగీత నృత్య నాటక పరిషత్ ఆధ్వర్యంలో భీమవరం డీఎన్ఆర్ ఇంగ్లీషు స్కూల్ ఆవరణంలో జరుగుతున్న 17వ జాతీయస్థాయి సాంఘిక నాటికోత్సవాలో రెండో రోజు శుక్రవారం రాత్రి మూడు నాటికల ప్రదర్శనలు అలరించాయి. తొలుత జాతీయస్థాయి నాటిక పోటీల జ్యోతి ప్రజ్వలనను లయన్స్ చిలుకూరి కృష్ణంరాజు, గోకరాజు పాండు రంగరాజు ప్రారంభించారు. నాటక పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, చైతన్య భారతి కార్యదర్శి మంతెన రామ్‌కుమార్‌రాజు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాస్, పేరిచర్ల లక్ష్మణవర్మ, బి.రాంబాబు, నాటిక పోటీలను పర్యవేక్షించారు..

'రైతే రాజు' నాటిక

దేశం వెలుపల జవాన్.. దేశంలో కిసాన్ వీళ్లు లేకపోతే ప్రజలు సుఖంగా బతకడం కష్టం అందుకే జైజవాన్.. జైకిసాన్..అన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ పెరిగి పిడికిడంత సెల్‌ఫోన్‌తో ప్రపంచాన్ని శాసిస్తున్నారు. సెల్‌ఫోన్ లేక పోయిన బతకవచ్చు కానీ రైతు పండించే అన్నం తినకుండా భూమ్మిద ఎవరూ బతకలేరు. అటువంటి రైతులు ఈ రోజును రోడ్డున పడితే వారి కష్టాలు ఎవరికి కన్పించడంలేదని రైతు కష్టాన్ని ప్రేక్షలకు కళ్లకు కట్టిన్నట్లు చూపించిన నాటిక రైతే రాజు' నాటిక ఈ నాటిక రచన కంచర్ల సూర్యప్రకాష్, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించగా నటీనటులు తమ నటనతో నాటికను మరింత రసరమ్యంగా అలరించారు.

'మనస్విని' నాటిక

డబ్బే ప్రధాన మంటున్న ఈ రోజుల్లో మానవ సంబంధాల్లోని, మానవీయ విలువల్ని, ఉన్నత సంస్కారాన్ని ఆదర్శాన్ని ఆవిష్కరిస్తూ డబ్బుకన్నా మానవ సంబంధాలే ఎంతో ఉన్నతమైనవని తెలిపిన నాటిక ఆరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి మనస్విని నాటిక, చన వల్లూరు శివప్రసాదు, మూలకధ పోత్తూరి విజయలక్ష్మి, దర్శకత్వం గంగోత్రి సాయి నాటికను రక్తి కటించారు.


'రైతే రాజు', 'మనస్విని' నాటికల్లో సన్నివేశాలు

'విముక్తి' నాటిక

సమాజాన్ని ముందుండి నడిపించాల్సిన యువత ఈ రోజున గంజాయి, హెరాయిన్ వంటి మత్తుపదార్థాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని. మత్తు పదార్థాల నుంచి యువతను రక్షించి దేశాన్ని కాపాడుకుందాం అనే కథా సారాంశంతో సాగిన నాటిక ఉషోదయ కళానికేతన్ కత్రిపాటు వారి విముక్తి నాటిక.

క్రైం సమాచారం

మనస్తాపంతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ఏలూరు క్రైం, మే 31 :అప్పులవాళ్ళు తన ఆటోను దౌర్జన్యంగా తీసుకువెళ్ళిపోయారని మనస్తాపం చెందిన ఓ ఆటో ఓనర్ కమ్ డ్రైవర్ ఆత్మహత్య గురువారం రాత్రి నగర శివారులో చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలివి. ఏలూరు రూరల్ పరిధిలో మాదేపల్లి పంచాయతీ లింగారావుగూడెంకు చెందిన పాకుర్ల వెంకన్నబాబు(33)కు భార్య సారమ్మ, ముగ్గురు పిల్లలున్నారు. ఓ ఆటో కొనుక్కుని నడుపుతూ కొంతకాలంగా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ అవసరాల నిమిత్తం ఏలూరుకు చెందిన ఓ వడ్డీ వ్యాపారి హన్నా అనే వ్యక్తి వద్ద రూ.40 వేలను నెల రోజుల క్రితం అప్పుగా తీసుకున్నాడు. ఆ బాకీ తీర్చకపోవడంతో గురువారం సాయంత్రం హన్నా మరో వ్యక్తితో కలిసి అతడి బాకీ నిమిత్తం ఆటోను బలవంతంగా తీసుకువెళ్లాడు. ఈ పరిణామంతో మనస్తాపానికి గురై కిడ్నీ రాళ్ల కరిగేందుకు ఉపయోగించే మాత్రలను అధిక మోతాదులో వేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఆటో తీసుకువెళ్ళిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతూ మృతుడి భార్య సారమ్మ ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లారీ క్లీనర్ అనుమానాస్పద మృతి

లారీలో నిద్రిస్తున్న ఒక క్లీనర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నెల్లూరు జిల్లా ఇందుకూరికోటకు చెందిన తలారి శ్రీనివాసరావు(40) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఏలూరు గూడ్స్‌షెడ్డు రోడ్డు వద్ద లారీని డ్రైవర్ మే 30వ తేదీన పార్కు చేయగా క్లీనర్ నిద్రించాడు. డ్రైవర్ వచ్చి చూసే టప్పటికి మృతి చెందాడు. ఈ ఘటనపై టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం ఏలూరు ప్రభుత్వాసు పత్రిలో శ్రీనివాసరావు మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

ఒంటరిగా జీవిస్తున్న ఒక యువకుడు మానసికంగా కృంగిపోయి జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు ఆదివారపుపేట మసీదు రోడ్డులో నివాసం ఉంటున్న షేక్ రెహమాన్ (21)కి వివాహం కాలేదు. మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడి తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితం మరణించగా అమ్మమ్మ వద్దే ఉంటూ ఒక షోరూమ్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు మరణించడం, కొద్ది నెలల క్రితం అమ్మమ్మ మరణించడంతో ఇంట్లో ఒంటరిగా ఉంటూ ఆందోళనకు గురయ్యాడు. జీవితంపై విరక్తి పెంచుకుని ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. శుక్రవారం రెహమాన్ మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

ఒక గుర్తు తెలియని యువకుడు జాతీయ రహదారిపై అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి దగ్గరలోని రైల్వే బ్రిడ్జిపై 16వ నంబరు జాతీయ రహదారిపై సుమారు 35 ఏళ్ల వయస్సు గల యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరురూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డికి తెలియ డంతో సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లారు. మృతుడి మెడలో రుద్రాక్ష మాల ధరించి ఉన్నాడు. ఫ్యాంట్, షర్టు ధరించి ఉన్నాడు. చెవిపోగులు ఉన్నాయి. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఏలూరు రూరల్ ఎస్ఐ 94407 96636 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

- రూ.47 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగేశ్వరరావు

తణుకు, మే 31 : తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీలు చేస్తున్న ఇద్దరు అంతర్ జిల్లా నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం తణుకు రూరల్ పోలీసు స్టేషన్ వద్ద రూరల్ సీఐ జీవీవీ నాగేశ్వరరావు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కోనసీమ జిల్లాల్లో నేరాలకు పాల్పడుతున్న ఇద్దరిని తణుకు అజ్జరం రోడ్డులో నిందితులైన భీమవరం పట్టణానికి చెందిన పందిరి వెంకటనారాయణ, తణుకు పట్టణానికి చెందిన నగరపు ఈశ్వరరావులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.47 లక్షల విలువైన 600 గ్రాములు బంగారం ఆభరణాలుతో పాటు 13 కిలోల వెండి వస్తువులు, రెండు మోటారు సైకిల్లు స్వాధీనం చేసుకున్నారు. పాత నేరస్తుడైన పందిరి వెంకటనారాయణకు హత్య కేసులో జైలుకు వచ్చిన ఈశ్వరరావుతో పరిచయం ఏర్పడిందన్నారు. గత ఆరు నెలల వ్యవధిలో పదిహేను నేరాలకు పాల్పడ్డారన్నారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ. కె.చంద్రశేఖర్, ఇరగవరం ఎస్ఐ డి.ఆదినారాయణ పాల్గొన్నారు. కేసులో సహకరించిన సిబ్బంది ఎం.యల్లారావు, షేక్ అన్వర్, మలక శ్రీనివాసు, ఎం.నాగశ్రీనివాసు, ఎం.లక్ష్మణరావు, కె.రుద్రేశ్వరరావులను జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి అభినందించారు.

భీమవరంలో మరొకరు..

భీమవరం క్రైం, మే 31 : భీమవరం టూటౌన్ ఏరియాలోని రైల్వే టన్నెల్ దగ్గరలో డీ-మార్ట్ సమీపంలో సుమారుగా 35-40 ఏళ్ల వయస్సు గల మగ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆ వ్యక్తి ముక్కుపొడుం రంగు ఫ్యాంట్, నీలం రంగు టీ షర్టు ధరించి ఉన్నాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిపిన వారుగాని, అతడి బంధువులు ఎవరైనా గుర్తుపడితే భీమవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ 08816-223653, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ భీమవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ 94407 96634 నంబర్లకు తెలపాలన్నారు.

15 మంది ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి

ఏలూరు క్రైం, మే 31 : ఏలూరు రేంజ్‌లో ఉన్న ఏఎస్ఐలలో 15 మందికి ఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు వీరికి పదోన్నతులు కల్పించారు. కృష్ణా జిల్లాలో పనిచేస్తున్న ఏఎస్ఐ ఆర్ఎస్ రంగనాధరావుకు ఎస్ఐగా పదోన్నతి కల్పించి పశ్చిమ గోదావరి జిల్లాకు కేటాయించారు. కాకినాడ జిల్లాలో పనిచేస్తున్న ఏఎస్ఐ ఆర్.సత్యనారాయణను ఏలూరు జిల్లాకు, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పనిచేస్తున్న బి.వెంకటేశ్వరరావు పశ్చిమగోదావరి జిల్లాకు, ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న డీవీ రమణ, ఎం.వెంకటేశ్వరరావులను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు కేటాయించగా కేవీ కృష్ణారావు, ఎం.శ్రీధర్, డీఎం శర్మ, అబ్దుల్ ఖరీమ్‌లను తూర్పుగోదావరి జిల్లాకు కేటాయించారు. ఎం.డి. నజీర్‌ఖాన్, సీహెచ్ నరసింహారావు, పి.వెంకటేశ్వరరావు, జీజే ఆనందరావు, జె.జ్ఞానదేవ్‌లను కాకినాడ జిల్లాకు కేటాయించారు. ఎం.వెంకటేశ్వరరావును ఆయన పనిచేస్తున్న ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడకు కేటాయించారు. వీరి ఎస్ఐల ప్రదోన్నతి తక్షణం అమలులోకి వచ్చిందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జాకీలతో ఇల్లును మూడు అడుగుల ఎత్తు లేపారు


జాకీలతో పైకిలేపిన ఇల్లు

ఆకివీడు, మే 31: నేటి సమాజంలో తల్లిదండ్రుల కంటే ఆస్తులకే ప్రాధాన్యతో ఇస్తున్న రోజుల్లో తండ్రి కట్టిన ఇంటిని కూల్చడం ఇష్టం లేక జాకీలతో పైకిలేపి ఇల్లు కడుతున్నాడు కుమారుడు. దుంపగడపలో తాపీమేస్త్రిగా పనిచేస్తున్న పిల్లా సోమేశ్వరరావు (శివ) తన తల్లిదండ్రులు రెండు న్నర సెంటుల్లో నిర్మించిన ముప్పై ఏళ్ల నాటి ఇంటిని మూడు అడుగులు పైకెత్తి నిర్మాణం చేపట్టారు. స్లాబ్ ఏరియా ప్రకారం అడుగుకు రూ.100 లెక్కన 650 అడుగులలో జాకీలతో పైకి లేపారు. జాకీలతో పైకిలేపే సమయంలో ఇంట్లోని వస్తువులు తీయనవసరంలేదు. భవనానికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా బిహార్‌కు చెందిన నిపుణులు సుమారు ఇరవై ఐదు రోజుల్లో పునాదుల్లోని బీములకు జాకీలుపెట్టి పైకిలేపి ప్రక్రియను పూర్తి చేశారు. తల్లిదండ్రులు నిర్మించిన భవనం లోతట్టు ప్రాంతంలో ఉండడంతో ఇంటి ఎత్తు పెంచేందుకు శివ చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు కింద నుంచి ఇటుకలతో కట్టుబడి కడుతూ జాకీలను తొలగించుకుంటూ వస్తున్నారు. ఈ నిర్మాణాన్ని గ్రామస్థులు ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు.

తెరుచుకోని వేండ్ర రైల్వే గేటు.. తప్పని ఇక్కట్లు


మూసుకుపోయిన రైల్వే గేటు

పాలకోడేరు, మే 31 :వేండ్ర రైల్వే గేటు తెరచుకోకపోవడంతో శుక్రవారం సాయంత్రం అటుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు ఐదు గంటల సమయంలో రైలు రావడంతో రైల్వేగేటును సిబ్బంది వేశారు. రైలు వెళ్లిన అనంతరం ఒక వైపు గేటు తెరుచుకోగా మరోవైపు ఉన్న గేటు తెరుచుకోకపోవడంతో పాలకోడేరు నుంచి వేండ్ర వైపు వెళ్లే వాహనదారులు, భీమవరం వచ్చే ప్రయాణికులు అరగంటపాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు గేటులో నుంచి వంగి ప్రయాణాలు సాగించారు. కొద్ది సేపటికి రైల్వే అధికారులు మరమ్మతులు చేయడంతో గేటు తెరుచుకుంది. భారీ వాహనాలు అటుగా ప్రయాణం సాగించాయి.

కోలుకుంటున్న హంతకుడు

ఏలూరు క్రైం, మే 31 : తనకు దక్కనిది మరెవరికి దక్కనివ్వనని ప్రేమోన్మాది తన మనస్సులో గట్టిగా నూరిపోసుకుని తన స్నేహితురాలిని నడిరోడ్డుపై నరికి హతమార్చిన హంతకుడు ప్రస్తుతం విజయవాడ ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. ముసునూరుకు చెందిన కట్టిబోయిన ఏసురత్నం (23) ఏలూరు సత్రంపాడులో ఉన్న ఒక డిగ్రీ కాలేజీలో చదువుతున్న రోజుల్లో తన క్లాస్‌మేట్ అయిన ఏలూరు ఎమ్మార్సీ కాలనీకి చెందిన జక్కుల రత్నగ్రేస్‌తో చనువుగా ఉండేవాడు. తనను పెళ్లి చేసుకోవాలని ఆమెను వేధించాడు. ఆమె నిరాకరించడంతో మే 30వ తేదీ మధ్యాహ్నం సత్రంపాడు సెంటర్ వద్ద ఆమెతో మాట్లాడే పని ఉందంటూ నమ్మకంగా ఒక వీధిలోకి తీసుకువెళ్లి తనను పెళ్ళి చేసుకోవాలని మరోసారి కోరాడు. నిరాకరించడంతో వెంటనే కత్తితో ఆమెను నరికి తన మెడ కోసుకున్నాడు. ఆమె మరణించింది. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి ఏసురత్నంను తరలించగా అతడి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని విజయవాడకు తరలించారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో అక్కడ వైద్యులు గురువారం రాత్రి కంఠానికి ఆపరేషన్ నిర్వహించారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని స్పృహలోనే ఉన్నాడని వైద్యులు ధ్రువీకరించారు. ఏసురత్నం సైగలతో మాత్రమే ఎదుటివాకి చెప్తున్నాడని ఆమె ఎలా ఉందని బతికిందా చనిపోయిందా అంటూ సైగల ద్వారా అడుగుతున్నాడని ఆసుపత్రి వర్గాలు తెలియజేశాయి. మొత్తం మీద హంతకుడు కోలుకుంటున్నాడు. అతడిపై ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హత్యా కేసు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, ఆత్మహత్యాయత్నం కేసు నమోదు చేశారు. ముందస్తుగా ఏలూరు త్రీ టౌన్ పోలీసులు అతడి వద్ద అనధికార నిఘా ఏర్పాటు చేశారు.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, మే 31: ఎన్నికల కోడ్ నేపథ్యంలో జూన్ 6 వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు తనిఖీ నిర్వహిస్తున్నారు. ఎస్పీ డి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రివేళ ముమ్మర గస్తీ నిర్వహిస్తున్నారు. మరోవైపు రోడ్డు ప్రమాదాల నివారణకోసం జాతీయ రహదారి, రాష్ట్రీయ రహదారిలో వాహన డ్రైవర్లకు ఫేష్‌వాష్ నిర్వహిస్తున్నారు. ప్రధాన నగరాల్లో పోలీసు గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులను విచారిస్తున్నారు. లాడ్జిలను కూడా తనిఖీలు చేస్తున్నారు. ఎంపీ, అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల ఈవీఎంలను సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచన నేపథ్యంలో అక్కడ మూడంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. కాలేజీ చుట్టు పక్కలకు ఎవరూ రాకూడదని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. నేర నియంత్రణకు ప్రత్యేక నిఘాను కొనసాగిస్తున్నారు.

నిడమర్రు, ఛానమిల్లి గ్రామాలలో కార్డన్ సెర్చ్



రాజకీయ పార్టీ నేతలతో ఎస్ఐ శ్రీను

నిడమర్రు, మే 31: ఎన్నికల వేళ శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఆర్.శ్రీను అన్నారు. నిడమర్రు, బావాయిపాలెం, ఛానమిల్లి గ్రామాల్లో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ముందుగా రాజకీయ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల అనంతరం గొడవలు పడరాదన్నారు. గ్రామాలు, కాలనీలలో పోలీసులు కార్డన్ సెర్చ్ వారెంట్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై డీపీవో ఆకస్మిక తనిఖీ



కూల్‌డ్రింక్ వ్యాన్‌కు తాళాలు వేస్తున్న డీపీవో

ఏలూరు రూరల్, మే 31: గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని, పలు ఫిర్యాదులు రావడంతో డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ శుక్రవారం నగరంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. డస్ట్‌బిన్‌లు లేని వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు పంచాయతీ పారిశుధ్య కార్మికులు గ్రామాలను శుభ్రం చేస్తుంటే పరిసరాలను పాడుచేస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఆర్.రెడ్డి మహిళా డిగ్రీ కళాశాల ఎదురుగా మొబైల్ కూల్‌డ్రింక్స్ వ్యాపారిని నిలదీశారు. డ్రింక్ తాగిన గ్లాసులను రోడ్డుపక్కన గుట్టలుగా ఉండడాన్ని గమనించి కూల్‌డ్రింక్ వ్యాన్‌ను తాళాలు వేయించి పరిసర ప్రాంతాలను శుభ్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు.

● పెదపాడు: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నామని డీపీవో తూతిక విశ్వనాథ్ తెలిపారు. వట్లూరు పంచాయతీ పరిధిలో పారిశుధ్య పరిస్థితులను డీపీవో విశ్వనాథ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల వద్ద అపారిశుధ్యం ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రవి

ఏలూరు రూరల్, మే 31: ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను ప్రతిఘటించాలని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పిలుపునిచ్చారు. మండలంలోని మాదేపల్లి, జాలిపూడి గ్రామాల్లో శుక్రవారం ఉపాధి హామీ పనిప్రదేశంలో కూలీలను కలసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని, కూలీలకు రూ.400వేతనం ఇవ్వాలని, పనిదినాలను 200రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు గోపి తదితరులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. జీలుగుమిల్లి, కామయ్యపాలెం, బొత్తప్పగూడెం గ్రామాల్లో ఉపాధి కూలీల సమస్యలు పరిశీలించారు. కూలీలను పని అనంతరం ఎండలో ఉంచటం తగదని సీపీఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు అన్నారు. పని ప్రదేశంలో కూలీలకు ఫస్ట్ ఎయిడ్ కిట్, టెంట్ మజ్జిగ సదుపాయం కల్పించాలన్నారు. ఉపాధి హామి పనులపై అధికారుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

లింగపాలెం, మే 31: ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఎంపీపీ వెంకటలక్ష్మి అన్నారు. మండల పరిషత్ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. వైస్ ఎంపీపీ మట్టా సురేష్ మాట్లాడుతూ ధర్మాజిగూడెంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి ధర్మాజిగూడెం గ్రామానికి త్రాగునీటి వెంటనే అందించాలని కోరారు. పలువురు ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లోని సమస్యలను ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను వెంటనే అందించాలని గ్రామాల్లో త్రాగునీరు, డ్రైనేజి సమస్యలు అధికారులు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరుదు రాంబాబు, ఎంపీడీవో వరుదు రాంబాబు, జడ్పీటీసీ వడ్లాని హరినాథరాజు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

6 నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకన

ఏలూరు ఎడ్యుకేషన్, మే 31: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రధాన పరీక్షలు శుక్రవారం ముగిశాయి. సోషల్ స్టడీస్ పరీక్షకు జిల్లాలో 4,671 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకోగా 1,869 మంది హాజరు కాగా 2,802 మంది గైర్హాజరైనట్టు డీఈవో అబ్రహం తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు. ఒకేషనల్, సంస్కృతం పరీక్షలు సోమవారంతో ముగుస్తాయి. కాగా జూన్ 6నుంచి 9వ తేదీ వరకు ఏలూరు సెయింట్ గ్జేవియర్ హైస్కూలులో టెన్త్ జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియను ప్రారంభించనున్నారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్స్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ

ఏలూరు ఎడ్యుకేషన్, మే 31: ఏపీ ఓపెన్ స్కూల్స్ పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమవుతున్నాయి. జూన్ 8వరకు జరుగుతాయి. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30గంటలవరకు నిర్వహించే ఈ పరీక్షలు జిల్లాలో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెంలలో మాత్రమే జరుగుతాయి. టెన్త్ పరీక్షలకు 720మంది, ఇంటర్ పరీక్షలకు 1094మంది దరఖాస్తుచేసుకున్నారని డీఈవో అబ్రహం తెలిపారు.

పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ఏలూరు ఎడ్యుకేషన్, మే 31: ప్రభుత్వ పాఠశాలల బాలబాలికలకు నూతన విద్యాసంవత్సరం (2024-25)లో విద్యా కానుకలో భాగంగా పంపిణీ చేయడానికి ఉద్దేశించిన వస్తువుల్లో శుక్రవారం వరకు 6,87,822 నోట్ పుస్తకాలు మాత్రమే అందాయని సమగ్రశిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బిసోమశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. వీటన్నింటినీ మండలాలవారీగా ఇప్పటికే పంపిణీ చేశామని, మరో 1,52,126 నోట్ పుస్తకాలు అందాల్సి ఉందన్నారు. జిల్లాకు అవసరమైన స్కూలు బ్యాగులు, యూనిఫాం దుస్తులకు సరిపడా వస్త్రం, బెల్టులు, బూట్లు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు ఇంతవరకు పంపిణీకాలేదన్నారు.

పొగాకు వినియోగం నియంత్రణకు కార్యాచరణ

ఏలూరు ఎడ్యుకేషన్, మే 31: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆశ్రం వైద్య కళాశాలలో వైద్యాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. పొగాకు వినియోగాన్ని నియంత్రించేందుకు జిల్లాలో 20 రోజుల పాటు వ్యూహాత్మక కార్యాచరణను జిల్లా వైద్యాధికారి డాక్టర్ శర్మిష్ట ప్రకటించారు. ప్రతీ విద్యాసంస్థను పొగాకు రహిత విద్యాసంస్థగా ప్రకటించడం, గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు. సిగరెట్, పొగాకు ఉత్పత్తుల చట్టం-2003 కఠినంగా అమలుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ప్రోగ్రాం ఆఫీసర్ నరేంద్రకృష్ణ, సర్వజన ఆస్పత్రి సైకియాట్రిస్ట్ వంశీకృష్ణ, డీఐవో నాగేశ్వరరావు, డీసీఎం వెంకట్, సైకలాజిస్ట్ చినవీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: పొగాకు రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మానవత స్వచ్ఛంధ సంస్థ జిల్లా డైరెక్టర్ ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం నిర్వహించారు. లైబ్రేరియన్ శ్రీనివాస్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం కారణంగా ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. ఉపాధ్యాయుడు మండే సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఫ్లైఓవర్‌పై పెరుగుతున్న చెట్టు



ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా జూట్‌మిల్ వరకు ఫ్లైఓవర్ రక్షణగోడ దుస్థితి



ఫ్లైఓవర్ దిగువన పగులుతున్న బీమ్

జూట్‌మిల్ ఫ్లైఓవర్

డేంజర్

ఎక్కడికక్కడ పగుళ్లు.. స్తంభాలపై పెరిగిన మొక్కలు

ఏలూరు రూరల్, మే 31: ఏలూరు జూట్‌మిల్లు వద్ద ఫ్లైఓవర్‌పై ప్రయాణం క్షణక్షణం భయంగా మారింది. సుమారు 40 ఏళ్ల క్రితం బ్రిడ్జి నిర్మించారు. జనాభా పెరుగుదలతో పాటు వాహనాల సంఖ్య అధికంగా పెరిగింది. ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలు, బస్సులు ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తాయి. వన్‌టౌన్, టూటౌన్ వచ్చేందుకు ఇదే ప్రధాన మార్గం. బ్రిడ్జి నిర్మాణం పటుత్వం కోల్పోతుంది. శ్లాబు అనేకచోట్ల పూర్తిగా పెచ్చులు రాలిపోతోంది. పిల్లర్లకు కూడా పగుళ్లు ఏర్పడి, ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. ఆర్అండ్‌బి అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో దీని పరిస్థితి ఇలా తయారైంది.

ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రైల్వే లైన్‌పై బ్రిడ్జిని నిర్మించారు. రోజురోజుకు వాహనాల రాకపోకల సంఖ్య విపరీతంగా పెరగడంతో బ్రిడ్జి క్రమేపి శిథిలావస్థకు చేరుతోంది. పగుళ్లతో పాటు స్తంభాలపై మొక్కలు ఏపుగా పెరగడం, శ్లాబు కింద సిమెంట్ బిళ్లలుగా ఊడిపోవడం భారీ వాహనాల రాకపోకలతో బ్రిడ్జి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. బ్రిడ్జిపై నిత్యం వేలాది వాహనాలు వచ్చిపోతుంటాయి. బ్రిడ్జికి అడుగుభాగాన అనేకచోట్ల పగుళ్ల ఏర్పడటంతో పాటు మర్రిచెట్లు మొలిచి ఊడలు బ్రిడ్జిలోపల నుంచి వ్యాపించి ఉన్నాయి. వీటివల్ల బ్రిడ్జికి ఎప్పటికైనా ప్రమాదమే. అటుగా వెళ్లే అధికారులు బ్రిడ్జి కిందనే నాలుగు, ఐదు ఆర్ అండ్ బీకి చెందిన కార్యాలయాలున్నా కనీసం కన్నెత్తి చూడకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బిడ్జిపై ఒక పక్క మొత్తం పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన పట్టించుకోకపోవడం శోచనీయమని స్థానికులు మండిపడుతున్నారు.



అల్లరి మూకలపై కాల్పులు జరుపుతున్న పోలీసులు



గొడవకు దిగిన అల్లరి మూకలు

ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు

● రెచ్చిపోయిన అల్లరి మూకలు ● కాల్పులు జరిపిన పోలీసులు ● విజయరాయిలో మాక్ డ్రిల్

పెదవేగి, మే 31: ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నూజివీడు డీఎస్పీ బి.లక్ష్మయ్య అన్నారు. విజయరాయిలో శుక్రవారం మాబ్ ఆపరేషన్ (మాక్ డ్రిల్) నిర్వహించారు. అల్లర్లు జరిగే సమయంలో ఎలాంటి చర్యలు చేపడతారో అలాంటి ఘట్టాన్ని విజయరాయిలో ఆవిష్కరించారు. అల్లరి మూకలను చెదరగొట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారో ప్రత్యక్ష అవగాహన కల్పించారు. రెచ్చిపోయిన అల్లరిమూకలను నిలువరించడానికి తొలుత సామరస్యంగా హెచ్చరికలు జారీచేశారు. అయినప్పటికీ ఆందోళనకారులు ముందుకు రావడంతో ముందస్తు హెచ్చరికగా వాటర్ కెనాన్‌ల ప్రయోగించారు. ఆందోళన విరమించకుండా ముందుకు వస్తుండడంతో లాఠీలకు పని చెప్పారు. అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, చివరిగా ఫైరింగ్ చేశారు. ఇదంతా చూసి తొలుత నిజంగా అల్లర్లు జరుగుతున్నాయా అనే భ్రమ స్థానికుల్లో కలిగింది. ఇదంతా ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై తీసుకునే చర్యల్లో భాగంగా మాక్ డ్రిల్ అని డీఎస్పీ బి.లక్ష్మయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాలతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, సీఐ కొండవీటి శ్రీనివాస్‌కుమార్, ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్, దెందులూరు ఎస్ఐ కె.స్వామి, సివిల్, ఏఆర్ పోలీసులు పాల్గొన్నారు.

● లింగపాలెం: ఎన్నికల నేపథ్యంలో మండలంలో 144సెక్షన్ అమల్లో ఉందని, ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని ధర్మాజిగూడెం ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. మఠంగూడెం, ధర్మాజిగూడెం గ్రామాల్లో ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జూన్ 4న జిల్లావ్యాప్తంగా 144సెక్షన్, 30 పోలీస్‌యాక్ట్ అమల్లో ఉన్నందున నలుగురు కంటే ఎక్కువ గుమికూడరాదని, సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా అసత్యప్రచారాలు చేసేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని అన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు జరపకూడదని, బాణసంచాపై నిషేధం ఉందన్నారు. కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని ఎస్ఐ సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం: పోలీస్ యాక్ట్ 30, సీఆర్పీసీ 144 సెక్షన్ అమలులో ఉన్నందున సభలు, సమావేశాలు, ర్యాలీలు నిషేధమని ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ అన్నారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ ఈ శ్రీనివాసుల పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ లక్ష్మణబాబు వారి సిబ్బందితో వన్‌టౌన్ పరిధిలోని వడ్డెరగూడెం, వెన్నవల్లి వారిపేటలలో ప్రజలతో అవగాహన సదస్సును నిర్వహించారు.



చింతలపూడి సాయిబాబా ఆలయంలో టీడీపీ నాయకుల పూజలు



పాతూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి

కూటమి ప్రభుత్వం ఏర్పడాలని పూజలు

చింతలపూడి, మే 31: ఓట్ల లెక్కింపు సమయం సమీపిస్తుండడంతో ఉత్కంఠ నెలకొంది. తమ ప్రభుత్వం ఏర్పడాలని పలువురు పూజలు చేస్తున్నారు. టీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో షిరిడీ సాయి సేవా మందిరంలో శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు పక్కాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, జిల్లాలో అన్ని సీట్లు కూటమి గెలుచుకోవాలని కోరుతూ ప్రార్థనలు చేశామన్నారు. పూజా కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొత్తపూడి శేషగిరిరావు, నాగభూషణం, రామారావు, సత్తిబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మకు ప్రత్యేక పూజలు.

ఏలూరు టూటౌన్: శ్రీరామ్‌నగర్‌లో గంగానమ్మకు 108 బిందెల జలాలతో అభిషేక కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కూటమి విజయం తథ్యం

కామవరపుకోట: కూటమి విజయం తథ్యమని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ అన్నారు. పాతూరులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు కూటమి అభ్యర్థులకు అనుకూలంగా వస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు చేస్తామని చంద్రబాబు ప్రకటించడంతో రైతాంగమంతా కూటమికే ఓట్లు వేశారన్నారు. 4న ఓట్ల లెక్కింపులో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రత్యర్థులు కవ్వింపు చర్యలకు పాల్పడతారని, ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు. కిలారు సత్యనారాయణ, సర్పంచ్ పసుమర్తి పార్థసారధిబాబు, బేతిన వెంకట్రావు, గోరింక దాసు, జిజ్జూరి బాబ్జీ, గూడపాటి కేశవరావు, తూతా లక్ష్మణరావు, మాన్యం దుర్గారావు, వేముల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సూపర్ స్టార్ కృష్ణకు అభిమానుల నివాళి



కేక్ కట్‌చేస్తున్న కృష్ణ అభిమానులు

ఏలూరు కల్చరల్, మే 31: తెలుగు సినీఖ్యాతిని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లిన ఘనత సూపర్‌స్టార్ కృష్ణకే దక్కుతుందని కృష్ణ అభిమాని, ఏపీ మెడికల్ కౌన్సిల్ డైరెక్టర్ దివిశాల వరప్రసాద్ అన్నారు. సూపర్‌స్టార్ కృష్ణ 81వ జయంతి కార్యక్రమాన్ని కృష్ణ, మహేష్ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరులో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మొదట కలర్ సినిమా, సినిమా స్కోప్, 70 ఎంఎం, సాంకేతిక పరిజ్ఞానాన్ని చిత్రసీమలో కృష్ణ ప్రవేశపెట్టారన్నారు. కృష్ణ అభిమాని నంది అవార్డు గ్రహీత ఖాజావలీ మాట్లాడారు. సాహసానికి మరోపేరుగా సూపర్‌స్టార్ కృష్ణ నిలిచారని, చిత్రపరిశ్రమ ఉన్నతికి ఎంతగానో పాటుపడ్డారని కొనియాడారు. కృష్ణ, మహేష్ అభిమానుల సంఘం సిటీవైడ్ ప్రెసిడెంట్ కె.నాగేంద్రనాని, సిరాజ్, ఇంద్రకుమార్, వెంకన్న, ఆదిబాబు, ఎం.రాహుల్, బాబి, మిధున్ తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: తెలుగు సినీ రంగ చిత్ర పరిశ్రమకు రంగుల సొబగులద్దిన దివంగత సినీ నటుడు సూపర్ స్టార్ 81వ జయంతి అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆటో యూనియన్ కార్యాలయం వద్ద కుంచే దొరబాబు, యెక్కిశెట్టి రాజా, షేక్ షెహిన్షా భాషా, సున్నం మురళి కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్పత్రిలో రోగులకు, పేదలకు పాలు పండ్లు పంచిపెట్టారు.

నాయకపోడులకు సాగుభూమి పట్టాలు ఇవ్వాలి

చింతలపూడి, మే 31: నాయక, నాయకపోడులు, ఇతర పేదలు సాగులో ఉన్న భూములకు సాగుపట్టాలు ఇవ్వాలని, ఏపీ రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ అధికారి షకీలాకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రైతుకూలీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ చింతలపూడి మండలం లింగగూడెం పంచాయతీలో గురుపట్లగూడెం, మేడియల్లప్పగూడెం ఏరియాల్లో షెడ్యూల్ తెగలకు చెందిన నాయక, నాయకపోడులు 40 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న 107 ఎకరాల భూమిలో సాగు పట్టాలు ఇవ్వాలని కోరారు. పేదల సాగులో ఉన్న భూములను కబ్జాదారులకు అన్యాక్రాంతం చేయడానికి కుట్ర జరుగుతోందన్నారు. భూములకు పోడుకొట్టి పోరాడి పేదలు సాధించుకున్న భూములతోనే జీవనోపాధి పొందుతున్నారని, సాగుపట్టాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. సాగుదారులు సమష్టి పోరాటం చేయాలని, తమ సంఘం అండగా ఉంటుందన్నారు. వినతిపత్రం అందించిన వారిలో కొండా రాము, బాబురావు ఉన్నారు.

ఏలూరు రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన అధికారులు



పనులను పరిశీలిస్తున్న రాంబాబు

ఏలూరు క్రైం, మే 31: ఏలూరు రైల్వే స్టేషన్‌ను విజయవాడ సౌత్ సెంట్రల్ రైల్వే వాణిజ్య విభాగం అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. విజయవాడ సౌత్ సెంట్రల్ రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు తన బృందంతో ఏలూరు రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. ప్రయాణికులకు మేలైన సౌకర్యాలు, భద్రత కల్పనపై పరిశీలన చేశారు. వెయిటింగ్ హాల్స్, లైటింగ్, మౌలిక సదుపాయాలు, నీటి సరఫరా, క్యాటరింగ్ స్టాల్స్, ఫుడ్ నాణ్యత, ఆహార పదార్థాల గడువు తేదీ, వాటర్ బాటిళ్ల లభ్యత, వాటి ధరలు పరిశీలించారు. స్టేషన్ పునరాభివృద్ధి పనులను పరిశీలించారు. అధికారులు, రైల్వే సిబ్బంది ప్రయాణికులతో మాట్లాడారు.

జిల్లా జైలును సందర్శించిన జిల్లా న్యాయమూర్తి

ఏలూరు క్రైం, మే 31: రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ అన్నారు. జిల్లా జైలును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అక్కడ ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యం, అత్యవసర పరిస్థితులలో అందిస్తున్న వైద్య సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రిమాండ్ ఖైదీలకు వారి కుటుంబ సభ్యులకు అవసరమైన ఉచిత న్యాయసదుపాయం అందించడం జరుగుతుందన్నారు. ఆయనతో పాటు జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి రత్న ప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ.బుల్లికృష్ణ, జిల్లా జైలు సూపరింటెండెంట్ ఆర్‌వీఎస్.స్వామి పలువురు పాల్గొన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై అడ్మిన్‌లదే బాధ్యత

పోలవరం, మే 31: ఓట్ల లెక్కింపు వరకు సోషల్ మీడియాలో లేదా వాట్సాప్ గ్రూపుల్లో విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా సందేశాలు ఫోటోలు పోస్టు చేస్తే సంబంధిత అడ్మిన్లే బాధ్యత వహించాలని ఎస్ఐ పవన్ కుమార్ అన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో ర్యాలీ, బాణసంచా, రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో గుమిగూడడం, సమావేశాలు, సభలకు అనుమతులు లేవన్నారు. సంబంధిత పార్టీల నాయకులు వారి కార్యకర్తలతో సమన్వయపరుచుకుని సహనంతో వచ్చే ఫలితాలకు ప్రజాతీర్పుకు సిద్ధపడి ప్రజల తీర్పుని గౌరవించాలని, గొడవలకు విద్వేషాలకు తావులేకుండా జాగ్రత్త పడాలని అన్నారు. హనుమత్ జన్మోత్సవాలు పురష్కరించుకుని ఊరేగింపులు చేయరాదని హెచ్చరించారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం

ఏలూరు కార్పొరేషన్, మే 31: నగరంలోని ఆంజనేయస్వామి ఆలయాల వద్ద హనుమజ్జయంతి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్వామి వారికి పంచామృతాభిషేకాలు అనంతరం విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. పాతబస్టాండ్ సెంటర్ మర్రి అభయాంజనేయస్వామి, పత్తేబాద, ఆర్ఆర్ పేట, ఎన్ఆర్‌పేట, మినీ బైపాస్ రోడ్డు ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల వద్ద హనుమాన్ జయంత్యుత్సవాలు ప్రారంభమయ్యాయి.

● పోలవరం: మండలంలో అభయాంజనేయస్వామి జయంత్యుత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు అర్చకులు శుక్రవారం తెలిపారు. పోలవరం ప్రాజెక్టు హిల్ వ్యూపై అభయాంజనేయస్వామి ఆలయం వద్ద, ప్రత్యేక పూజలు, అన్నదానం, పోలవరంలో ఆంజనేయస్వామి, గూటాల, ప్రగడపల్లి ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు.

సామూహిక రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చన

ఏలూరు కార్పొరేషన్, మే 31: సత్రంపాడు అంబికాదేవి ఆలయంలో శుక్రవారం సామూహిక రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చన చేశారు. అమ్మవారికి, శ్రీచక్రానికి పంచామృతాభిషేకం అనంతరం విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

బావిశెట్టివారిపేట కనకదుర్గాంబ ఆలయంలో మహిళలు సామూహిక శ్రీ లక్ష్మీ కుంకుమార్చన నిర్వహించారు. ధ్వజస్తంభాల వద్ద ప్రమిదలతో దీపాలు వెలిగించి అమ్మవారిని ఆరాధించారు.

వైభవంగా గంగానమ్మ ఊరేగింపు



గంగానమ్మ ఊరేగింపు

ఏలూరు కల్చరల్, మే 31: శనివారపుపేట గౌరవరం ప్రజల ఆరాధ్యదైవం గంగానమ్మ ఆలయ 12వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రీరామ్‌నగర్ 9వ రోడ్డు చివర అమ్మవారి వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఉదయం 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం, విశేష అలంకరణ అనంతరం అమ్మవారిని ట్రాక్టర్‌పై ఉంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆళ్ళ మోహన్‌రావు, గుత్తుల ప్రసాద్, కొండపల్లి శ్రీనివాస్, సిరిబత్తిన శివనారాయణ, కొణతాల సూర్యకాంతం పర్యవేక్షించారు.

దొంతవరంలో గోగులమ్మ జాతర

ఉంగుటూరు, మే 31: మండలంలోని దొంతవరం గ్రామంలోని గోగులమ్మ, పెద్దింట్లమ్మ జాతర శుక్రవారం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. జనసేన నాయకులు పత్సమట్ల ధర్మరాజు సోదరుడు భీమరాజు, పడవల మహంకాళీరావు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి శాంతి కల్యాణం

పెదపాడు, మే 31: అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉత్సవ విగ్రహాలకు శాంతికల్యాణం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామివారిని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ

పోలవరం, మే 31: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల మధ్యాహ్న భోజన పథక కార్మికులకు శనివారం డీఈవో ఆదేశాల మేరకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంఈవో జె.సురేష్ బాబు శుక్రవారం తెలిపారు. నూతన విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం పరిశుభ్రమైన నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారం అందించాలని, మెనూ తప్పక పాటించాలని మధ్యాహ్న భోజన పథక కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.సత్యనారాయణ, మండల సీఆర్పీలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** వేసవిలో ప్రజల దాహార్తిని తీరుస్తున్న విద్యుత్ ఉద్యోగుల సేవలు అభినందనీయమని ఎస్ఈ సాల్మన్‌రాజు అన్నారు. రామకృష్ణ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ శిబిరంలో ఆయన పాల్గొన్నారు.
- **ఏలూరు క్రైం :** సీసీఎస్ ఎస్ఐ పి.ప్రకాశరావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఎస్ఐ ప్రకాశరావును సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఏఎస్పీ జి స్వరూపరాణి, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ నాగేశ్వరరావు, ప్రకాశరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.
- **పోలవరం :** మండలంలో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు శుక్రవారం 95 మంది గైర్హాజరైనట్లు ఉపాధ్యాయులు వి సూర్యనారాయణ మూర్తి శనివారం తెలిపారు. 146 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 51 మంది మాత్రమే హాజరయ్యారని తెలిపారు.
- **లింగపాలెం :** పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఆశాలు, ఏఎన్ఎమ్‌లు పర్యవేక్షిస్తూ గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆరోగ్యవిస్తరణ అధికారి అబ్రార్ హుస్సేన్ అన్నారు. కె.గోకవరం పిహెచ్‌సీ పరిధిలో డాక్టర్ ఆర్.కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో ముడిచర్ల గ్రామంలో డ్రైడేఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు.
- లింగపాలెం మండలం ధర్మాజిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో సోషల్ పరీక్షకు 61మంది గైర్హాజరు అయ్యారని ఎంఈవో రామారావు, ఎగ్జామ్ చీఫ్ శివరామ్ తెలిపారు.
- **ఉంగుటూరు :** దోమల నివారణకు డ్రైడే పాటించాలని తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఆరోగ్య ఉప అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. చేబ్రోలు పీహెచ్‌సీ పరిధిలోని ఎ.గోకవరం, గోపీనాథపట్నం గ్రామాలలో దోమల నివారణపై అవగాహన కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు.
- ఉంగుటూరు మండలం కైకరంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసారు. గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కారమైంది.
- ఉంగుటూరుకు చెందిన తాపీ మేస్త్రి కర్రి శ్రీనాథ్ పనికి వెళ్లి తిరిగి రాలేదు. అతని సోదురుడు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.
- **పెదవేగి :** వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పుస్తకం విలువలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే గ్రంథపఠనంపై ఆసక్తిని పెంచుకోవాలని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ సూచించారు.
- **చింతలపూడి :** ఓట్ల లెక్కింపు సమీపించడంతో ఓటమి భయంతో సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలు తగదని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు కొమ్మరాజు సత్యనారాయణ అన్నారు. లెక్కింపు రోజున అవసరమైతే అల్లర్లను సృష్టించాలనడం దురదృష్టకరమన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఆయన హుందాగా వ్యవహరించాలన్నారు.




శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల భవనం (ఇన్‌సెట్) పెచ్చులూడిన స్లాబ్

పెచ్చులూడి పడుతున్నా పట్టించుకోరేం?

- శిథిలావస్థలో పశు వైద్యశాల భవనం
- వానొస్తే తడిచి ముద్దవుతున్న మందులు

కలిదిండి, మే 31 : మండలంలో సానారుద్రవరంలో పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. నాలుగు దశాబ్దాల క్రితం ఈ భవనాన్ని నిర్మించారు. ఇప్పటి వరకు మరమ్మతులు చేసిన దాఖలాలుల్లేవ్. భవనం స్లాబు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. వర్షానికి స్లాబ్ లీకవటంతో మందులు తడిచి ముద్దవుతున్నాయి. స్లాబ్ పెచ్చులూడి పడటంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. గోడలు బీటలు వారాయి. ఏ క్షణంలో భవనం కూలిపోతుందోనని భయాందోళన చెందుతున్నారు. శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల భవనాన్ని కూల్చివేసి నూతన భవనం నిర్మించాలని పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పశువులు అధికంగా ఉండటంతో నిత్యం పశువైద్యశాల రద్దీగా ఉంటుంది. ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని పశువుల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పశువైద్యశాల నూతన భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

6 నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకన

ఏలూరు ఎడ్యుకేషన్, మే 31: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రధాన పరీ క్షలు శుక్రవారం ముగిశాయి. సోషల్ స్టడీస్ పరీక్షకు జిల్లాలో 4,671 మంది బాల బాలికలు దరఖాస్తు చేసుకోగా 1,869 మంది హాజరు కాగా 2,802 మంది గైర్హాజ రైనట్టు డీఈవో అబ్రహం తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు. ఒకేషనల్, సంస్కృతం పరీక్షలు సోమవారంతో ముగుస్తాయి. కాగా జూన్ 6నుంచి 9వ తేదీ వరకు ఏలూరు సెయింట్ జేవియర్ హైస్కూలులో జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియను ప్రారంభించనున్నారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్స్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ

ఏలూరు ఎడ్యుకేషన్, మే 31: ఏపీ ఓపెన్ స్కూల్స్ పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమవు తున్నాయి. జూన్ 8వరకు జరుగుతాయి. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30గంటలవరకు నిర్వహించే ఈ పరీక్షలు జిల్లాలో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెంలలో మాత్రమే జరుగుతాయి. టెన్త్ పరీక్షలకు 720మంది, ఇంటర్ పరీక్షలకు 1094మంది దరఖాస్తుచేసుకున్నారని డీఈవో అబ్రహం తెలిపారు.

పొగాకు వినియోగం నియంత్రణకు కార్యాచరణ

ఏలూరు ఎడ్యుకేషన్, మే 31: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆశ్రం వైద్య కళాశాలలో వైద్యాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. పొగాకు వినియోగాన్ని నియంత్రించేందుకు జిల్లాలో 20 రోజుల పాటు వ్యూహాత్మక కార్యాచరణను జిల్లా వైద్యాధికారి డాక్టర్ శర్మిష్ట ప్రకటించారు. ప్రతీ విద్యాసంస్థను పొగాకు రహిత విద్యాసంస్థగా ప్రకటించడం, గ్రామాల్లో విస్తృ తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు. సిగరెట్, పొగాకు ఉత్పత్తుల చట్టం-2003 కఠినంగా అమలుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ప్రోగ్రాం ఆఫీసర్ నరేంద్రకృష్ణ, సర్వజన ఆస్పత్రి సైకియాట్రిస్ట్ వంశీకృష్ణ, డీఐవో నాగేశ్వరరావు, డీసీఎం వెంకట్, సైకలాజిస్ట్ చినవీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: పొగాకు రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మానవత స్వచ్ఛంద సంస్థ జిల్లా డైరెక్టర్ ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం నిర్వహించారు. లైబ్రేరియన్ శ్రీనివాస్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం కారణంగా ఆరోగ్యాన్ని నాశనం చేసుకుం టున్నారన్నారు. ఉపాధ్యాయుడు మండే సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై డీపీవో ఆకస్మిక తనిఖీ

ఏలూరు రూరల్, మే 31: పారిశుధ్య నిర్వహణపై పలు ఫిర్యాదులు రావడంతో డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ శుక్రవారం నగరంలో ఆకస్మిక తనిఖీ నిర్వ హించారు. డస్ట్‌బిన్‌లు లేని వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎండకు జనం విలవిల

ముదినేపల్లి, మే 31: ముదినేపల్లిలో శుక్రవారం అధిక ఉష్ణోగ్రతలకు జనం అల్లాడారు. సూర్యుడు నిప్పులు చెరగడంతో వడగాల్పులకు ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం 10 గంటలకే వేడిగాలులు ప్రారంభం అయ్యాయి. ఇళ్లనుంచి జనం బయటకు వచ్చేందుకు భయపడ్డారు. ముదినేపల్లి - కైకలూరు, గుడివాడ, జాతీయ రహదార్లు నిర్మానుష్యంగా కనిపించాయి. ఎప్పుడు రద్దీగా ఉండే ముదినేపల్లిలో గురజ రోడ్డు సెంటరు బోసిపోయింది.

క్రైం సమాచారం

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నూజివీడు టౌన్, మే 31 నూజివీడు మండలం మొర్సపూడి గ్రామంలో గల శ్రీనివాసా హేచరీస్ కంపెనీ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు నూజివీడు రూరల్ ఎస్సై మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. 35 నుంచి 40 ఏళ్ల వయసు గల వ్యక్తి మాసినగడ్డంతో చొక్కా లేకుండా శ్రీనివాస హేచరీస్ ఉత్తరపు గేటు సమీపంలో విగతజీవిగా పడి ఉన్నాడని, స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వివాహితపై లైంగిక దాడి

ముసునూరు, మే 31: వివాహితపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై ముసునూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు వివరాల ప్రకారం మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన కొండపల్లి చెన్నారావు కొద్ది నెలలుగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని, గురువారం ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడని, ఈ విషయం ఎవరికైనా చంపేస్తానని బెదిరించినట్టు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అనధికార మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్ఈబీ సీఐ

నూజివీడు టౌన్, మే 31: నూజివీడు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 78 అనధికార మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్నట్టు ఎస్ఈబీ సీఐ వెంకట రమణ తెలిపారు. చాట్రాయి మండలం కోటపాడులో నిర్వహించిన దాడుల్లో మల్లెల్లి లక్ష్మి అనే మహిళను అదుపులోకి తీసుకుని ఆమె నుంచి 48 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే తూర్పుదిగవల్లికి చెందిన పామర్తి రాంబాబును అదుపులోకి తీసుకుని 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.



చాట్రాయిలో నిరుపయోగంగా ఉన్న వీఆర్వో కార్యాలయ భవనం

వినియోగించకుండానే శిథిలావస్థకు..

నిరుపయోగంగా వీఆర్వో కార్యాలయ భవనాలు

చాట్రాయి, మే 31: మండలంలోని చాట్రాయి, పర్వతాపురం, సోమవరం గ్రామాల్లో 6 ఏళ్ళ క్రితం గత ప్రభుత్వ హయాంలో లక్షల ఖర్చుతో నిర్మించిన వీఆర్వో కార్యాలయ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రతి గ్రామంలో ప్రజలకు వీఆర్వోలు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలు అందించాలనే లక్ష్యంతో తొలి దశలో ఒక్కొక్కటి రూ. 4 లక్షల ఖర్చుతో 3 గ్రామాల్లో వీఆర్వో కార్యాలయ భవనాలు నిర్మించారు. దశలవారీగా అన్ని గ్రామాల్లో వీఆర్వో కార్యాలయ భవనాలు నిర్మించాలనేది అప్పటి పాలకుల లక్ష్యం. భవనాలు పారంభోత్సవాలు జరిపారు కానీ వాటిలో అధికారులు ప్రజలకు సేవలందించిన దాఖలాలు లేవు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ సచివాలయ వ్యవస్థ అమలులోకి రావటంతో వీఆర్వోలు సచివాలయాల్లోనే ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే కొత్త భవనాలు వినియోగించకుండానే శిథిలమైపోయే ప్రమాదం ఉంది. గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలకు, పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న వీఆర్వో కార్యాలయ భవనాలను, అవసరం ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు గానీ ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు గానీ కేటాయిస్తే భవనాలు వినియోగంలోకి వచ్చి ప్రజాధనం వృథా కాకుండా ఉంటుందని పలువురు కోరుతున్నారు.



ఏబీ వెంకటేశ్వరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఏబీవీకి టీడీపీ నాయకుల అభినందన

ముసునూరు, మే 31: సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు శుక్రవారం పదవీ విరమణ సందర్భంగా టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. శుక్రవారం ముసునూరు మండల నాయకులు కాటేపల్లి నాగేశ్వరరావు, కూచిపూడి దేవేంద్ర, మాదల వెంకటేశ్వరరావు, నూజివీడు నియోజకవర్గ టీడీపీ నాయకులు నూతక్కి వేణుగోపాలరావు విజయవాడలో ఏబీవీని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు ఎదురొడ్డి నాలుగేళ్ళుగా పోరాడి, ఉద్యోగ విరమణ చివరి రోజు మరలా పోస్టింగ్ తెచ్చుకుని, విధులను చేపట్టిన ఏబీవీ ధైర్య సాహసాలు అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. వైసీపీ అరాచకాలకు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.



ట్రై సైకిల్ వితరణ

కైకలూరు, మే 31: దివ్యాంగుల సంక్షేమానికి దాతల సహకారం అభినందనీయమని కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కైకలూరు మండలం వరహాపట్నంలో నిమ్మగడ్డ సురేష్ పేరిట ఆయన కుమారుడు హేమంత్ ఆర్థిక సాయంతో ట్రైసైకిల్‌ను కామినేని చేతుల మీదుగా దివ్యాంగుడికి అందజేశారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలు తన దృష్టికి తెస్తే వారి సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. టీడీపీ నాయకులు బీకేఎం నాని, పూల రామచంద్రరావు, బోయిన శ్రీనివాస్, పేరిచర్ల ప్రసాదరాజు, నాగనబోయిన పవన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడాలని పూజలు

చింతలపూడి, మే 31: ఓట్ల లెక్కింపు సమయం సమీపిస్తుండడంతో ఉత్కంఠ నెలకొంది. తమ ప్రభుత్వం ఏర్పడాలని పలువురు పూజలు చేస్తున్నారు. టీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో షిరిడీ సాయి సేవా మందిరంలో శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు పక్కాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, జిల్లాలో అన్ని సీట్లు కూటమి గెలుచుకోవాలని కోరుతూ ప్రార్థనలు చేశామన్నారు. టీడీపీ నాయకులు కొత్తపూడి శేషగిరిరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మకు ప్రత్యేక పూజలు..

ఏలూరు టూటౌన్: శ్రీరామ్‌నగర్‌లో గంగానమ్మకు 108 బిందెల జలాలతో అభిషేక కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధా కృష్ణయ్య పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థినులను సత్కరిస్తున్న దృశ్యం

పూర్వ విద్యార్థినులకు సన్మానం

కైకలూరు, మే 31: ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన పూర్వ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. శుక్రవారం కైకలూరు వెలంపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన మరడాని శివాని, పందిరిపల్లి శ్యామలను అభినందించారు. వీరు గతంలో వెలంపేట ఎంపీ యూపీ స్కూల్లో చదువుకున్నారని, అంతేగాక నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌లో ఉత్తీర్ణత సాధించడమే గాక పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించారన్నారు. వెలంపేట ఎంపీయూపీ పాఠశాలలో 8వ తరగతి వరకు చదివి పాఠశాలకు పేరు తీసుకువచ్చారని హెచ్‌ఎం దానం ప్రసాద్ కొనియాడారు. నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఉపాధ్యాయులు జీవీవీ సత్యనారాయణ, బండికోళ్ళ శ్రీను, జి. సముద్రుడు, జయశ్రీ, మణి, జి. రామాంజనేయులు, జయరాం నాయుడు, శిరీష, ఎండీ అక్బర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సీతాదేవి కుటుంబీకులకు 'నెట్టెం' పరామర్శ



కలిదిండి, మే 31 : ఇటీవల మృతి చెందిన మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘు రామ్ కొండూరులో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ కేబినెట్‌లో విద్యాశాఖ మంత్రిగా సీతాదేవి సమర్థవంతంగా పని చేశారన్నారు. విజయ డెయిరీ డైరెక్టర్‌గా రైతులకు మెరుగైన ఆదాయం సమకూర్చటానికి తనవంతు కృషి చేశారన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థించారు.

క్రిస్టియన్ మైనార్టీ సంఘ జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్



ముదినేపల్లి, మే 31 : క్రిస్టియన్ మైనారిటీ సంఘ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా ముదినేపల్లి ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు ఏజే సుధాకర్ నియమితులయ్యారు. ముదినేపల్లిలో శుక్రవారం జరిగిన క్రిస్టియన్, మైనార్టీల సంఘ సభ్యుల సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు సేవా నాగ జగన్ బాబూరావు, మాదిగ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసుపోగు దానియేలు సుధాకర్‌కు నియామక పత్రం అందజేశారు. సంఘ ముదినేపల్లి మండల శాఖ అధ్యక్షుడిగా బండి ఇమ్మానియేలుకు నియామకపత్రం అందజేశారు. ముంబైకి చెందిన సీనియర్ పాస్టర్లు జి.దానియేలు, వినయ్ మాథ్యూస్, జి.ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు.




ముసునూరులో విద్యుద్దీపాలంకరణలో భక్తాంజనేయస్వామి ఆలయం, ముదినేపల్లిలో పూజలందుకున్న స్వామివారు



కలిదిండిలో ఏర్పాటు చేసిన 18 అడుగుల భారీ విగ్రహం

హనుమజ్జయంతికి ఏర్పాట్లు



తుక్కులూరులో ముస్తాబైన అడవి ఆంజనేయస్వామి ఆలయం

ముదినేపల్లి, మే 31 : ముదినేపల్లి మారుతీ నగర్‌లోని సువర్చలా సమేత భక్తాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేసి అర్చకులు శ్రీనివాసులు ఫణికుమార్ , బృందావనం చక్రపద్మ నరసింహం పూజలు, అభిషేకాలు జరిపారు. అష్టోత్తర శతనామ పూజ, వాస్తు పూజ, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాడుగుల పూర్ణచంద్రరావు, వాసవీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి వత్తుమిల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పూజలు జరిపారు.

కలిదిండి: హనుమజ్జయంతి ఉత్సవాలకు గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలకు రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. కలిదిండిలో శనివారం అభయాంజనేయస్వామికి పూజల అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నామని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అలాగే పెదలంక, మూల్లంక, గుర్వాయిపాలెం, పోతుమర్రు, తాడినాడ గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. కలిదిండిలో పాతాళ భోగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఇటీవల ఏర్పాటు చేసిన 18 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నామని భక్తులంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

ముసునూరు: శనివారం హనుమజ్జయంతి సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాల్లో చలువ పందిళ్ళు వేసి, అన్నదాన కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ముసునూరు సిల్క్‌నగర్‌లో ఉన్న శ్రీభక్తాంజనేయ స్వామి, సగరుల కాలనీలో గల అభయాంజనేయ స్వామి ఆలయాలు, చెక్కపల్లిలో దాసాంజనేయస్వామి, గోగులంపాడు శివారు కొత్తూరులోని వీరాంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం, స్వామివారికి అభిషేకాలు, ఆకుపూజతోపాటు అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు.

నూజివీడు టౌన్: శనివారం నాడు హనుమజ్జయంతిని పురస్కరిం చుకుని నూజివీడులోని ఆంజనేయస్వామి ఆలయాలను సర్వాంగసుందరంగా అలంకరించారు. తుక్కులూరు అడవి ఆంజనేయస్వామి ఆలయంతో పాటు నూజివీడు పట్టణంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాలు విద్యుద్దీపాలతో అలంకరించి ఉత్సవాల నిర్వహణకు ఆలయకమిటీ సభ్యులు సిద్ధమయ్యారు.

నేడు చాట్రాయిలో భారీ అన్నసమారాధన

చాట్రాయి: హనుమజ్జయంతి సందర్భంగా జూన్ 1వ తేదీ శనివారం చాట్రాయిలోని భారీ హనుమాన్ విగ్రహం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని అన్న ప్రసాదం స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.



కలిదిండిలో ముస్తాబైన అభయాంజనేయ స్వామి ఆలయం

పాఠశాలలో కుక్కలను బంధించి రెండు రోజుల పాటు తాళం?

ముదినేపల్లి రూరల్, మే 31: పెదపాలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని శాంతకుమారి రెండు రోజుల కిందట కుక్కలను కార్యాలయంలో బంధించి తాళం వేయటం దారుణమని సర్పంచ్ ఘంటా రాకేష్ కుమార్ ఆరోపించారు. తాళం వేసిన హెచ్‌ఎం ఎవ్వరికీ చెప్పకుండా వెళ్ళిపోయిందన్నారు. నైట్ డ్యూటీకి వెళ్లిన వాచ్‌మన్‌కు ఆఫీస్ రూం నుంచి కుక్కల ఆర్తనాదాలు విని సదరు హెచ్‌ఎంకి ఫోన్ చేసినా ఫోన్ లిఫ్ట్ చేయక పోవడంతో తనకు, పాఠశాల ఛైర్మన్‌కు తెలియపరిచాడని సర్పంచ్ పేర్కొ న్నారు. విషయాన్ని తెలుసుకున్న తాము కంప్యూటర్ ఆఫీస్ రికార్డులు కుక్కలు ధ్వంసం చేసినట్లు గుర్తించామన్నారు. వాటి మలమూత్రాలను కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులతో శుభ్రం చేయించామన్నారు.



ముసునూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వాసు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ముసునూరు, మే 31: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలను అతిక్రమించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.వాసు హెచ్చరించారు. శుక్రవారం ముసునూరులోని ప్రధాన కూడళ్ళలో ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కౌంటింగ్ జరిగే రోజు కాని, తరువాత కానీ గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ర్యాలీలు నిర్వహించడం, బాణాసంచా కాల్చటం, ఘర్షణలకు దిగితే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ 10వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎక్కువ మంది గుమిగూడి ఉన్నా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా సహించేది లేదని ఎస్ఐ వాసు హెచ్చరించారు.

274 మంది విద్యార్థులు గైర్హాజరు

నూజివీడు టౌన్, మే 31: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ సాంఘిక శాస్త్రం పరీక్షకు నూజివీడు డివిజన్ పరిధిలో మొత్తం ఐదు పరీక్షా కేంద్రాల్లో 274 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు డీవైఈవో సేవ్యా తెలిపారు. ఆగిరిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 106 మంది విద్యార్థులకు 47మంది హాజరు కాగా, 59 మంది గైర్హాజరు అయ్యారన్నారు. చాట్రాయి జడ్పీ హైస్కూలులో 47 మందికి 19 మంది హాజరు కాగా, 28 మంది గైర్హాజరయ్యారని, ముసునూరు జడ్పీ హైస్కూలులో 100 మంది విద్యార్థులకు 42 మంది హాజరు కాగా, 58 మంది గైర్హాజరయ్యారని, నూజివీడు ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో 124 మందికి, 42 మంది హాజరై 82 మంది గైర్హాజరయ్యారన్నారు. బాలికోన్నత పాఠశాలలో 93 మంది విద్యార్థులకు 46 మంది హాజరు కాగా, 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు టౌన్, మే 31: నూజివీడు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. అన్నవరం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న నూజివీడు పట్టణం ఎమ్మార్ అప్పారావు కాలనీ, హనుమంతులగూడెం, వెంకటాద్రిపురం, ఓగిరాల తండా, సిద్ధార్థనగర్ పరిసర ప్రాంతాల్లో లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

కలిదిండి, మే 31 : హనుమజ్జయంతి సందర్భంగా శనివారం సాయంత్రం 4 గంటలకు కోరుకొల్లు ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభించే హనుమాన్ శోభాయాత్ర భక్తిపూర్వక బైక్ ర్యాలీ విజయవంతం చేయాలని ఆధ్యాత్మిక మండలి పిలుపునిచ్చింది. సానారుద్రవరం, ఎస్.ఆర్పీ ఆగ్రహం, పడమటిపాలెం, కలిదిండి మార్కెట్ యార్డు వరకు శోభాయాత్ర జరుగుతుందన్నారు.



వార్డెన్ నజీర్‌కు పదవీవిరమణ సత్కారం

ముసునూరు, మే 31: హాస్టల్ వార్డెన్‌గా షేక్ నజీర్ సేవలు అభినందనీయమని నూజివీడు ఏఎస్‌డబ్ల్యూవో రవిప్రసాద్ అన్నారు. ముసునూరు బీసీ హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న నజీర్ కు ఉద్యోగ విరమణ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మానసభలో పలువురు వార్డెన్‌లు, ఏఎస్‌డబ్ల్యూవో మాట్లాడుతూ వార్డెన్ గా నజీర్ సేవలు నేటి ఉద్యోగులకు ఆదర్శనీయమన్నారు. అనంతరం నజీర్ దంపతులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. నూజివీడు, కైకలూరు, అవనిగడ్డ నియోజకవర్గాలకు చెందిన బీసీ హాస్టళ్ల వార్డెన్‌లు, సిబ్బంది, నజీర్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



చలసాని ఆంజనేయులుకు సత్కారం

చాట్రాయి, మే 31: ఎన్టీఆర్ జిల్లా ఎ. కొండూరు మండలం జీళ్ళకుంట పాల సహకార సంఘంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులును చాట్రాయి మండలంలోని పాల సంఘాల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు, బీఎంసీ సిబ్బంది సన్మానించారు. ఆయన ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘాల అధ్యక్షులు మాట్లాడుతూ చలసాని హయాంలో పాడి రైతులకు అత్యధిక పాల ధర ఇవ్వటంతో పాటు, కల్యాణమస్తు, క్షీరబంధు మొదలైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ప్రశంసించారు. పాలకవర్గ సభ్యుడు బొట్టు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల గుర్తింపు



ముసునూరు, మే 31: దివ్యాంగ పిల్లలను గుర్తించే ప్రక్రియను శుక్రవారం ఐఈఆర్టీలు చేపట్టారు. ముసునూరులో ఐఈఆర్టీలు లక్ష్మీనారాయణ, నాగ మల్లేశ్వరి ఇంటింటికి వెళ్ళి ఐదేళ్లలోపు చిన్నారులతోపాటు 6 నుండి 18 ఏళ్ళు ఉన్న బడి ఈడు దివ్యాంగ పిల్లలను గుర్తించి, వివరాలను నమోదు చేశారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా నూతనంగా 19 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించామని, వీరికి ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు పర్యవేక్షణలో భవిత సెంటర్‌లో చేర్చుకుని, ఫిజియోథెరపీ చికిత్సతోపాటు ఉపకరణాలను ఉచితంగా అందిస్తామని లక్ష్మీనారాయణ తెలిపారు.